**మహిళ పదేళ్ల నరకయాతనకు ముగింపు**




**రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి**




PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 198 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 14 జులై 2026

## బనకచర్లపై నోటీసులు ఇవ్వడం

# కుదరదు

- తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం స్పష్టీకరణ

- పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని వెల్లడి




**న్యూఢిల్లీ,జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** పోలవరం, గోదావరి నీటి వినియోగం, బనకచర్ల అనుసంధానం అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ వేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలని, ఇంజక్షన్ ఉత్తర్వులు మిగతా2లో...

## పవన్ కళ్యాణ్‌కు సిఎం ఫడ్నవీస్ పరామర్శ



**ముంబై,జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** తన భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. సందర్భంగా పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని ఫడణవీస్ అడిగి తెలుసుకున్నారు. ఆయన మిగతా2లో...




ఎల్-నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు

## ప్రభుత్వం సన్నద్ధం

- మూడు దశల ముందస్తు కార్యాచరణ
- ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలతో మంత్రి తుమ్మల ఉన్నతస్థాయి సమీక్ష
- కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలి
- వాతావరణ, భూగర్బజలాలు, నీటిలభ్యత పరిస్థితులపై బులెటిన్ విడుదల
- 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్-నినోపై రైతులకు ప్రత్యేక అవగాహన
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్,జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎల్-నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ లో భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, మిగతా2లో...

## కేంద్ర సహకారంతోనే

# అభివృద్ధి సాధ్యం

- పార్లమెంటులో వివిధ సమస్యలపై ప్రస్తావించాలి
- మెట్రో, ట్రిపుల్ ఆర్ తదతిర అంశాలపై అనుమతులు రాబట్టాలి
- ఎంపీలతో ప్రజాభవన్‌లో సిఎం రేవంత్ భేటీ
- ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు
- సమావేశంలో సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు హాజరు



**హైదరాబాద్,జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. హైదరాబాద్ కు ఎఐఓ ను తీసుకురావాలి. ఇందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలన్నారు. మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. మెట్రో విస్తరణకు సంబంధించి రుణాల పక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని అన్నారు. మిగతా2లో...

## షాబాద్ నరహంతకుడు

# మృతి

- పురుగుల మందు తాగి ఆత్మహత్య
- సూసైడ్‌కు ముందు సెల్ఫీ వీడియో
- కొత్తూరు మండలంలో ఘటన
- వివరాలు వెల్లడించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి




## సాధ్యమైనంత మేర గోదావరి


# జలాల వినియోగం

- మేడిగడ్డ వద్ద గేట్లు మూసివేస్తే బ్యారేజ్‌కు ప్రమాదం
- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక మేరకు నడుచుకుంటున్నాం
- సమ్మక్క ప్రాజెక్టును సందర్శించిన మంత్రులు




## జాడలేని వర్షాలు... ముఖం చాటేసిన మబ్బులు

- మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు






## సుప్రీం సాక్షిగా బయటపడ్డ

# రేవంత్ వైఫల్యం

- బనకచర్లపై పిటిషన్ అంతా తప్పులదడక
- గురువు చంద్రబాబు కోసమే డ్రామాలు
- మరోమారు మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు

**సంగారెడ్డి,జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు సుప్రీంకోర్టు సాక్షిగా బయటపడ్డాయని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మొదటి నుంచి రాజకీయ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని ధ్వజమెత్తారు. తన రాజకీయ గురువు చంద్రబాబుకి మిగతా2లో...

## సింగరేణిని భ్రష్టు పట్టించిన

# బిఆర్ఎస్, కాంగ్రెస్


- గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారు
- అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోంది
- సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




**భద్రాద్రి కొత్తగూడెం,జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):**సింగరేణిలో ప్రస్తుత పరిస్థితికి కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారని ఆరోపించారు. సింగరేణిని అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అక్రమంగా కేటాయించిన మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసిందని.. బొగ్గు గనులను పారదర్శకంగా కేటాయించాలని మిగతా2లో...

## సిఎం రేవంత్ దిగజారుడు భాష

- బూతుపురాణాలు సరికాదు
- ఎంపి ఈటెల రాజేందర్ హితవు



**హైదరాబాద్,జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర చరిత్రలో అత్యంత దిగజారుడు భాష మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి ఒక్కడేనని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. గత కొద్ది రోజులుగా ప్రతిపక్షాలను అందునా బీఆర్ఎస్ లక్ష్యంగా బూతు పురాణం అందుకుంటున్న మిగతా2లో...

# సాధ్యమైనంత మేర గోదావరి జలాల వినియోగం

**ములుగు,జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం గోదావరి జలాలను సాధ్యమైనంత మేర వినియోగించు కోవాలని నిర్ణయించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సమక్క బ్యారేజ్‌లో గేట్లు మూసివేయడం వల్ల 71 మీటర్ల ఎత్తులో నీటి నిల్వలు ఉన్నాయని, అందువల్ల దేవాదుల ప్రాజెక్టు ద్వారా 7 మోటార్లతో నీటిని ఎత్తిపోస్తున్నామని చెప్పారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్టును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకున్న మంత్రులకు జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వస్సల్ టోప్పో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత సమక్క బ్యారేజ్, దేవాదుల ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రులు గోదావరి జలాల వినియోగం, కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కన్నెపల్లి పంప్‌హౌస్ ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించే వారికి వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. మేడిగడ్డ వద్ద గేట్లు మూసివేస్తే బ్యారేజ్‌కు ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించారని, వారి సూచనలను పాటిస్తున్నామని తెలిపారు. పారే నీటినే ఎత్తుకునే అవకాశం ఉంటే మూడు బ్యారేజీలు ఎందుకు నిర్మించారో మాజీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికల ఆధారంగానే ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 22 రిజర్వాయర్ల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని వెల్లడించారు. సమక్క బ్యారేజ్‌లో నీటిని నిల్వ చేస్తే పంపింగ్ సులభమవుతుందని చెప్పారు.

మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం నుంచి ప్రవహించే నీటిని పంపింగ్ చేసే అవకాశం ఉన్నప్పుడు భారీ బ్యారేజీల నిర్మాణం ఎందుకు చేపట్టారో మాజీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, ఇంజినీర్ల సూచనల మేరకే ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. గతంలో నిర్మించిన అనేక డ్యామ్‌లు సురక్షితంగా ఉండగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన బ్యారేజీలు మాత్రం నాణ్యత సమస్యలతో నిలిచిపోయాయని ఆరోపించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కాళేశ్వరం నీటిని ఉపయోగించకుండానే గత ఏడాది 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నాణ్యత లోపాలు ఉన్నాయని నిపుణుల కమిటీ ఇప్పటికే నివేదించిందని తెలిపారు. మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయొద్దని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ గత ప్రభుత్వ హయాంలోనే సూచించిందని గుర్తుచేశారు. డిజైన్ మార్పులు, నాణ్యతా లోపాల కారణంగానే ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. మేడిగడ్డపై ఐఐటీ బాంబే నిపుణులతో పాటు సైన్యం సహకారంతో సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్నామని.. మరమ్మతులకు అవసరమైన నివేదికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేస్తున్నామని, ప్రస్తుతం 7 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నామని చెప్పారు.

# ఎల్-నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మి÷-లలెట్స్ రీసెర్చ్, సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధరంగ ఉన్నతాధికారులతో మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహిం చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మూడు దశల కంటిం జెన్సీ ప్రణాళికలను సమగ్రంగా పరిశీలించి, శాస్త్రవే త్తలు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తుది కార్యా చరణపై మంత్రి చర్చించారు. ముందుగా వివిధ ఇన్స్టిట్యూషన్స్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎల్-నినో పరిస్థితులను తట్టుకునే విధంగా వారు వారు సిద్ధం చేసిన కార్యాచరణను మంత్రికి తెలియచేశారు. ముఖ్య ంగా కరువు పరిస్థితు లను ఎదుర్కొనేందుకు వీలుగా తట్టుకొనే పంటలు మరియు రకాలు, ఇప్పటికే సాగు చేసిన పంటలలో తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సమర్పించారు. మంత్రి మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి యాజమాన్య చర్యను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, జిల్లాల్లో అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అనుబంధ రంగ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. తరువాత మాట్లాడిన వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎల్-నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం వంటి అవకాశాల ను దృష్టిలో పెట్టుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపది కగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు. జూలై 15 వరకు వర్షాలు ఆలస్యమైతే 16.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, జూలై 30 వరకు ఆలస్యమైతే 13.82 లక్షల క్వింటాళ్లు, ఆగ స్టు 15 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే 12.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవ సరమవు తాయని అంచనా వేసి ముందుగానే అందు బాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# షాబాద్ నరహంతకుడు మృతి

**కొత్తూరు,జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):**రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో అతి కిరాతకంగా ఆరుగురిని హత్య చేసిన హంతక ఉన్మాది రాజ్ కుమార్ కథ విషాదంగా ముగిసింది. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ పరిధిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో సైతం తీసుకున్నాడు. కొత్తూరు మండలంలోని పెన్జర్ల రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్ సమీపంలోని వ్యవసాయ పొలంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు సిబ్బంది రాజ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించేందుకు మృతిని సోదరుడు, పెంజర్ల గ్రామంలో నివాసముండే మేనమామలను పిలిపించారు. వారు రాజ్ కుమార్ (29) మృతదేహాన్ని గుర్తించారు. మృతుని పక్కన పురుగుల మందు డబ్బా పడి ఉంది. ఘటనా స్థలాన్ని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిందితుడు రాజ్‌కుమార్.. షాబాద్‌లో ఓ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తూ ఉండేవాడు. దాంతో మే నెలలో ఇతనిపై బాలిక బంధువులు ఫిర్యాదు చేయడంతో షాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కింద కేసు నమోదు చేశారు. పోక్సో కేసు పెట్టారన్న కోపం పెంచుకున్న నిందితుడు.. శుక్రవారంఅర్ధరాత్రి బాలిక ఇంటికి వెళ్లి.. ఆమె తల్లి, అమ్మమ్మను కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం బాలికను తీసుకొని దైవాలగూడానికి చేరుకొని, అతని సొంత ఇంట్లో భార్య, ఇద్దరు కుమారులను కుడా కత్తితో పొడిచి చంపాడు. తిరిగి అక్కడ నుండి బాలికను తీసుకొని సుమారు 200 మీటర్ల దూరంలో బాలికను కూడా హత్య చేసి పరారయ్యాడు. అనంతరం అతని తండ్రికి ఫోన్ చేసి.. 'నేను ఆరుగురిని హత్య చేశాను.. నేను కూడా ఆత్మహత్య చేసుకుంటున్న' అని చెప్పాడు. అయితే ఆరుగురి హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. పోలీసులు 12 బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం కొత్తూరు మండలం పెంచర్ల రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్‌లో మృతదేహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. ఆ మృతదేహం రాజ్ కుమార్‌దిగా గుర్తించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితునికి ఆన్‌లైన్ బెట్టింగ్ కూడా అలవాటు ఉంది. ఆన్‌లైన్ బెట్టింగ్ పెట్టి సుమారు రూ.2కోట్లు అప్పు చేశాడు. దాంతోపాటు అతడు 16 సిమ్ కార్డులను తీసుకొని నెంబర్లు మారుస్తూ వాడుతున్నాడు.

**వాడిని అంత ప్రశాంతంగా చనిపోనియాల్సింది కాదు..: మృతుని సోదరుడు భాస్కర్**

అభం శుభం తెలియని పసిపిల్లలతోపాటు మరో ముగ్గురి ప్రాణాలు తీసిన రాజ్‌కుమార్ అంత ప్రశాంతంగా చనిపోవాల్సింది కాదని, వాడిని ఎన్‌కౌంటర్ చేసి చంపాల్సిందని మృతుని సోదరుడు భాస్కర్ అన్నారు. వాడి వల్ల ఎన్నో కుటుంబాలు నాశనం అయ్యాయని ఏడుస్తూ పోలీసుల ముందు మొరపెట్టుకున్నాడు.


# సుప్రీం సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

(మొదటి పేజీ తరువాయి)

గురుప్రదక్షిణ చెల్లించుకునేందుకే సీఎం రేవంత్ ఆరాటపడుతున్నారని విమర్శించారు. గోదావరి, నల్లమల కేసులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి మొట్టికాయలు వేసిందని, కావాలనే లోపాలతో కూడిన కేసును వేయడం వల్లే ఈ కేసు నిలువదని ఉన్నత న్యాయమూర్తులు చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో చేస్తున్నట్లు చూపించుకోవడానికి కేవలం బ్యాక్ డేట్ ఉత్తరాలు రాసిందని ఎద్దేవా చేశారు.గోదావరి బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి బీఆర్ఎస్ మొత్తుకుంటూనే ఉందని హరీష్ రావు తెలిపారు. చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కు అయ్యారని చెప్పడానికి ఇంకేం ఆధారాలు కావాలి? 'నువ్వు కొట్టినట్టు చెయ్.. నేను తిట్టినట్టు చేస్తా' అన్నట్లుగా రేవంత్ డ్రామాలు ఆడుతున్నారు. రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహినే కాదు, తెలంగాణకు జలద్రో హిగా కూడా మారిపోయారు' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బనకచర్లపై సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్, ఆ తర్వాత దొంగచాటుగా వెళ్లారని ఆరోపించారు. పైగా చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుడైన, తెలంగాణ ద్రోహి అయిన ఆదిత్యనాథ్ దాస్‌ను కమిటీలో ఎలా నియమిస్తారని నిలదీశారు. రేవంత్ రెడ్డికి జల వనరులపై అవగాహన తక్కువ, ఆవేశం ఎక్కువ అని హరీష్ రావు ఎద్దేవా చేశారు. గోదావరి నల్లమల సాగర్‌పై ఆంధ్రప్రదేశ్ టెండర్లను 11 డిసెంబర్ 2025 నాడే పూర్తి చేసిందని, దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం 16 డిసెంబర్ 2025న రిట్ పిటిషన్ వేసిందని హరీష్ రావు గుర్తుచేశారు. అది డిస్మిస్ అయిన తర్వాత గత 7 నెలలుగా ఈ ప్రభుత్వం ఏం చేస్తూ తమాషాలు చేస్తోందని ప్రశ్నించారు. నిన్న మొన్నటి వరకు రివ్యూలు చేయాల్సిన పాలకులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకో వడానికి బీఆర్ఎస్‌పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలో ముగ్గురు సీఎంల అజెండా ఏంటో రేవంత్ రెడ్డి బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 'ఎన్ఓసీ' పేరిట తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ ఏపీకి అమ్ము కుంటున్నారని, దీనిపై అసెంబ్లీని సమావేశపరిచి చర్చ జరపాలని, దొంగచా టుగా వ్యవహారాలు నడిపితే తాము ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో రేవంత్ తీరు అనుమానాస్పదంగా ఉందని, అందుకే ఇవాళ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ సమావేశానికి వెళ్లలేదని పేర్కొన్నారు.

# జాడలేని వర్షాలు... ముఖం చాటేసిన మబ్బులు

## - మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు




**హైదరాబాద్,జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో జులై నెలలోనూ ఎండలు తీవ్రత మళ్లీ మెల్లగా పెరుగుతోంది. వర్షాలు ముఖం చాటేయంతో ఎండలు కొనసాగుతున్నాయి. సాధా రణంగా ఈ కాలంలో వర్షాలు కురవాల్సి ఉండగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. జులై రెండో వారంలోనూ సాధారణం కంటే సుమారు 3.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగటి వేళల్లో ఎండ తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, వచ్చే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, అనారోగ్య సమస్యలున్న వారు అవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. అలాగే తగినంత నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం, ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలని పిటిషన్‌లో కోరింది. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. లోపాలు సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. 15 మంది ప్రతివాదులు ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. లోపాలు సరిదిద్దాక విచారణలో మిగతా అంశాలు పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. పిటిషన్‌పై విచారణ జరపకుండా నోటీసులివ్వలేమని తెలిపింది. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా, ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయ్యిందంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒరిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకారమే విచారణకు రావాలని స్పష్టం చేసింది.రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇటువంటి ఒరిజినల్ సూట్ పిటిషన్‌ను ముందుగా చాంబర్ జడ్జి ముందు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ ప్రక్రియ పూర్తికాకముందే ప్రతివాదులకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అయితే, అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదననూ సుప్రీంకోర్టు పట్టించుకోలేదు.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్, కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేసిందని తెలిపారు. సింగరేణిలో కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. సింగరేణికి నైనీ కోల్ బ్లాక్ కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమానికి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇప్పటివరకు వేలం ద్వారానే బొగ్గు గనులు కేటాయిస్తూ వచ్చామని అన్నారు. మోదీ ప్రభుత్వం వేలం లేకుండా ఇచ్చిన ఏకైక బ్లాక్.. తాడిచర్ల-2 అని తెలిపారు. సింగరేణికి అండగా ఉండాలనే ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సింగరేణిలో బొగ్గు మాయమైందని కేటీఆర్, హరీశ్ లేఖలు రాసినట్లు చెప్పారు. 'సింగరేణి అంశంలో కేంద్రం తలదూర్చదని మీకు తెలియదా? మెస్సీతో ఫుట్‌బాల్ ఆడేందుకు సింగరేణి డబ్బు ఖర్చు చేస్తారా? సింగరేణిని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేశారు' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల పాటు సింగరేణిని కేసీఆర్ ఓటు బ్యాంకుగా చూశారని వ్యాఖ్యానించారు. సింగరేణికి చేసిన మేలు ఏమిటో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌పై మాత్రం కేసీఆర్ మాట్లాడలేదన్నారు. సింగరేణిలో ఏం జరిగినా కేంద్రాన్ని సంప్రదించడం లేదన్నారు. సింగరేణిపై కేంద్రం పెత్తనం ఉండదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వాల విధానాలపై మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వ కాలంలో దేశంలో అతిపెద్ద బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆ సమయంలో జరిగిన బొగ్గు గనుల కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, అనంతరం బొగ్గు బ్లాకుల కేటాయింపులు పారదర్శకంగా జరగాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వేలం ప్రక్రియ లేకుండానే సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ను కేటాయించిందని తెలిపారు. ఈ బ్లాక్‌లో గ్రేడ్-8 నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, మరో 40 నుంచి 50 సంవత్సరాల వరకు సింగరేణి అవసరాలను తీర్చగల సామర్థ్యం ఉందని చెప్పారు. సింగరేణి సమస్యలను తాను పలుమార్లు ప్రధాని దృష్టికి తీసుకెళ్లానని, సంస్థకు మరిన్ని బొగ్గు బ్లాకులు అవసరమని కేంద్ర ప్రభుత్వానికి వివరించానని కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం సింగరేణి ఎదుర్కొంటున్న పరిస్థితులకు బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు.

# కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్ఆర్ఆర్ భూసేకరణ ఒక కొలిక్కి వచ్చింది.. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని దాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధి ంచి కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. సాగునీటికి సంబంధించి తుంగ భద్ర గేట్స్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్ తో చర్చించాం. ఉమ్మడి రాష్ట్రంలో మంజూ రైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇవ్వాల్సి ఉంది. డిండి-30 టీఎంసీలకు, పాలమూరు రంగా రెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు-90 టీఎంసీలకు ఔక్షఅ ఇవ్వాల్సి ఉంది.

120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చు. గోదావరి, కావేరి నదుల అనుసం ధానంతో రాష్టానికి ప్రయోజనం ఉంటుంది. కేంద్రం సహకరిస్తే కేంద్రం సహకరించిందని మేం నిరభ్యంతరంగా చెబుతాం. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవని అన్నారు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్ట్స్ కు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఎంపిలతో భేటీలో రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలతో పాటు బిజెపి ఎంపిలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ దిగజారుడు భాష

(మొదటి పేజీ తరువాయి)

సీఎం తీరుపై ఆయన స్పందించారు. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద నీళ్లు 94 మీటర్లు లేకున్నా కేవలం రూ.2 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మించి నీళ్లు లిఫ్ట్ చేయొచ్చు. అది వదిలేసి సలహాలు ఇస్తున్న ఇంజినీర్లను తిట్టడం, బీఆర్ఎస్ నాయకుల రక్తం చిందిస్తా అనడం మూర్ఖత్వమన్నారు. రేవంత్ రెడ్డి నాకు ఎన్‌డీఎస్ఏ చెప్తేనే ప్రాజెక్టుల్లో నీళ్లు నింపుతా అని అజ్ఞానంతో మాట్లాడుతున్నాడు.

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పిల్లర్లు ఎక్కడా కుంగిపోలేదని, ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్ ప్రకారం అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు గ్రౌటింగ్ కూడా చేశారన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నందున అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీళ్ళు నింపుతామని రేవంత్ రెడ్డి ఎన్‌డీఎస్ఏ దగ్గరికి వెళ్ళి అడిగాడా? అని నిలదీశారు. ఇప్పటికైనా భేషజాలకు పోకుండా కాళేశ్వరం జలాలతో ప్రాజెక్టులను నింపి రైతులను ఆదుకోవాలని హితవు పలికారు.

# పవన్ కళ్యాణ్‌కు సిఎం ఫడ్నవీస్ పరామర్శ

(మొదటి పేజీ తరువాయి)

త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యులు అందిస్తున్న చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై కూడా వివరాలు ఆరా తీశారు. తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆస్పత్రికి వచ్చి పరామర్శించినందుకు దేవేంద్ర ఫడణవీస్‌కు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీ సంద ర్భంగా ఇద్దరు నాయకులు కాసేపు ఆత్మీయంగా పలుకరించుకున్నట్లు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటు న్నారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడంతో అభిమానులు, జనసేన కార్యకర్తలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

# రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

## జిల్లా కార్యదర్శి యంగల ఆనందరావు

**సత్తుపల్లి, జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి యంగల ఆనందరావు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15, 16, 17 తేదీల్లో మేడ్చల్ , మల్కాజిగిరి జిల్లా నాగోల్ బండ్లగూడలోని నవచేతన విజ్ఞాన సమితి ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా నుంచి పది మంది ప్రతినిధులు ఈ



శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలను ప్రైవేటీకరణ చేస్తూ దళిత, బడుగు బలహీన వర్గాలను విద్యకు, నాణ్యమైన వైద్య సేవలకు దూరం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. సామాజిక, రాజకీయ చైతన్యం పెంపొందించుకోవడానికి ఇలాంటి రాజకీయ శిక్షణ తరగతులు ఎంతో అవసరమని, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి తడికమల్ల యోబు, జిల్లా కమిటీ సభ్యులు చిల్లిముంత మధు, సత్తుపల్లి, పెనుబల్లి మండలాల నాయకులు చిల్లిముంత రవి, కోలేటి వెంకటేశ్వరరావు, వెంకటరమణ, తడికమల్ల యశోద, కిన్నెర లక్ష్మి, ఆళ్లగట్ల జిగిరి తదితరులు పాల్గొన్నారు.

# మహిళ పదేళ్ల నరకయాతనకు ముగింపు



● ఖమ్మం 'ఎఫెక్స్' ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స! ● కిడ్నీ నుండి 70 ఎంఎం భారీ రాయి తొలగింపు.. ● ఏలూరు మహిళకు పునర్జన్మ ప్రసాదించిన డాక్టర్ కె. కిషోర్ కుమార్ రెడ్డి!



**ఖమ్మం ప్రతినిధి, జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం 'ఎఫెక్స్' ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి మహిళ పదేళ్ల నరకయాతనకు ముగింపు పలికినట్లు ఎఫెక్స్ మల్టీ స్పెషాలిటి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ యూరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ కె. కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. ఖమ్మం నగరం, బాలాజీ నగరంలోని ఎఫెక్స్ మల్టీ స్పెషాలిటి ఆసుపత్రిలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఆమె వయసు ముప్పై ఏళ్లు.. కానీ గడిచిన పదేళ్లుగా ఆమె అనుభవిస్తున్న నరకయాతన వర్ణనాతీతం. కడుపులో కదలాడుతున్న నొప్పితో నిత్యం నరకం చూసిన ఆ మహిళకు ఖమ్మం నగరంలోని ప్రముఖ ఎఫెక్స్ వైద్యులు సంజీవనిలా మారి పునర్జన్మను ప్రసాదించారు. ఎఫెక్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుల అద్భుతమైన ప్రతిభతో, అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతమై, సదరు మహిళను ప్రాణాపాయం నుండి సురక్షితంగా కాపాడగలిగారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఏలూరు జిల్లా, జీలుగుమిల్లు గ్రామానికి చెందిన మైలవరపు విఘ్నేశ్వరి (30) గత పదేళ్లుగా తీవ్రమైన కిడ్నీ నొప్పితో బాధపడుతున్నారు. ఎన్నో చోట్ల చూపించుకున్నా తగ్గని ఆ వేదనతో, చివరి ప్రయత్నంగా జూలై 10న ఖమ్మం బాలాజీ నగరంలోని ఎఫెక్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆశ్రయించారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ కె. కిషోర్ కుమార్ రెడ్డి ఆమెను పరీక్షించగా.. కిడ్నీలో తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌తో పాటు, ఊహించని విధంగా సుమారు 70 ఎంఎం పరిమాణం (800 గ్రాముల బరువు) కలిగిన ఒక భారీ రాయి ఉన్నట్లు గుర్తించారు. **జీవన్మరణ పోరాటంలో వైద్యుల అద్భుత విజయం** కిడ్నీలో ఇన్‌ఫెక్షన్ ఉండటంతో ఆపరేషన్ చేయడం ఎంతో సవాలుతో కూడుకున్నప్పటికీ, వైద్య బృందం ఏమాత్రం అధైర్యపడలేదు. జూలై 11న డాక్టర్ కిషోర్ కుమార్ రెడ్డి నేతృత్వంలో సుమారు గంటన్నర పాటు అత్యంత జాగ్రత్తగా, చాకచక్యంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆ భారీ రాయిని విజయవంతంగా తొలగించి, ఆ యువతిని ప్రాణాపాయ స్థితి నుండి కాపాడారు. **"వైద్యుడే నా పాలిట దేవుడు!"** "గత పదేళ్లుగా క్షణం నరకం చూశాను. ఎఫెక్స్ ఆసుపత్రి వైద్యులు నాకు కొండంత ధైర్యం చెప్పారు. ఎంతో జాగ్రత్తగా ఆపరేషన్ చేసి నా కడుపులోని ఆ పెద్ద రాయిని తీసేసి, నాకు ఈ రోజు నొప్పి లేని జీవితాన్ని ఇచ్చారు. వారికి నా జీవితాంతం రుణపడి ఉంటాను" అని బాధిత మహిళ విఘ్నేశ్వరి కన్నీటి పర్యంతమవుతూ తన కృతజ్ఞతలు చాటుకున్నారు. వైద్యుల అంకితభావానికి, మానవీయ కోణానికి ఈ ఘటన ఒక నిదర్శనంగా నిలిచింది. ఈ అరుదైన విజయ సాధనలో డాక్టర్ కిషోర్ కుమార్ రెడ్డితో పాటు న్యూరాలజిస్ట్ డాక్టర్ ముకుంద బర్మా, గైనకాలజిస్ట్ డాక్టర్ ఆర్. లలిత, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ దినేష్ కుమార్ రెడ్డి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాకేష్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శివరాం రెడ్డి, ఆసుపత్రి మేనేజర్ కొరిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొని, బాధితురాలికి మెరుగైన జీవితాన్ని అందించినందుకు హర్షం వ్యక్తం చేశారు. సంక్లిష్ట సమయాల్లోనూ ధైర్యంగా ప్రాణాలు నిలిపిన ఎఫెక్స్ వైద్య బృందాన్ని యావత్ సమాజం అభినందిస్తోంది.

# మల్లంపల్లి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం.. లారీ ఢీకొని ఇద్దరు దుర్మరణం





**మల్లంపల్లి మండల ప్రతినిధి జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లంపల్లి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. అతివేగంగా వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, ములుగు పట్టణంలోని ప్రేమ్‌నగర్‌కు చెందిన కొమ్మినేని సమ్మారావు (56) మల్లంపల్లి బ్రిడ్జి వద్ద ఉన్న ఆర్&బీ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆదివారం సాయంత్రం విధులకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరిన ఆయన, తన స్నేహితుడు గందు సురేష్ (46), టిటీవీసీ కంపెనీలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వ్యక్తితో కలిసి మల్లంపల్లి వైపు ద్విచక్ర వాహనంలో వెళున్నారు. రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో మల్లంపల్లి సమీపానికి చేరుకోగా, వెనుక నుంచి అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చిన TG 12 U 4446 నంబర్ గల లారీ వారి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తలతో పాటు శరీరంలోని పలు భాగాలపై తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడు కొమ్మినేని సమ్మారావు భార్య ఇమ్మనేని ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ములుగు పోలీసులు క్రైమ్ నం. 241/2026గా కేసు నమోదు చేశారు. లారీ డ్రైవర్‌పై దీఎన్ఎస్ సెక్షన్లు 281, 106(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఓటరు జాబితా సవరణలో వేగం పెంచండి: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్


● ఎస్ఐఆర్2026 పనులను గడువులోగా పూర్తి చేయాలి
● ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్‌పై క్షేత్రస్థాయిలో తనిఖీ
● ఓటర్లకు ఇబ్బందులు లేకుండా డిజిటైజేషన్ పూర్తి చేయాలి
● పోలింగ్ కేంద్రాల్లో ఎస్ఐఆర్ పనులను పరిశీలించిన సబ్ కలెక్టర్



**సత్తుపల్లి, జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పనులను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని పోలింగ్ స్టేషన్ నెం. 186, 223తో పాటు సత్తుపల్లి మండలంలోని గంగారం, బేతుపల్లి గ్రామాల పరిధిలోని పోలింగ్ స్టేషన్ నెం. 239, 241, 297లను సందర్శించి డిజిటైజేషన్ పనుల పురోగతిని సమీక్షించారు. పనుల నాణ్యత, వేగం, ఖచ్చితత్వాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్, నిర్దేశిత గడువులోగా డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలకు ఆదేశించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి ఎన్యూమరేషన్ ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలను తప్పుల్లేకుండా నమోదు చేయాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా,సమర్థవంతంగా నిర్వహించి గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

● ప్రజావాణిలో వినతుల స్వీకరణ.. అధికారులకు సత్వర పరిష్కార ఆదేశాలు
● ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి ● ప్రజల సమస్యలపై అధికారులతో సమీక్ష ● వినతుల పరిష్కారంలో జాప్యం వద్దు అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశాలు




**కల్లూరు, జూలై 13 (పిసిడబ్ల్యు న్యూస్) :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో కలిసి ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులు నిర్దేశిత గడువు లోగా పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదా రీతనంతో కూడిన పాలనను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిపై బాధ్యతాయుతంగా స్పందించి, సత్వర పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించి, సంబంధిత అంశాలపై అవసరమైన చర్యలు ప్రారంభించారు.

# మల్లంపల్లిలో నూతన ఫోటో స్టూడియో ప్రారంభంస్టూడియోను ప్రారంభించిన సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు

**మల్లంపల్లి మండల ప్రతినిధి, జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండల కేంద్రంలో బక్కి కళ్యాణినాగరాజు దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన ఫోటో స్టూడియోను గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి స్టూడియోను ప్రారంభించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి స్టూడియో యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన ఫోటోగ్రఫీ సేవలను సరసమైన ధరలకు అందిస్తూ వ్యాపారాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఇలాంటి వ్యాపారాలను ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వనమా శ్రీనివాస్, కాగితపు దేవేందర్, పిండి రవి యాదవ్, తోటకూరి శ్రీకాంత్, అంకం మహేందర్, బక్కి నవీన్, యువకులు మరియు స్థానికులు పాల్గొన్నారు.



# కల్లూరు మున్సిపాలిటీలో ఘనంగా 'మిషన్ శుభ్రత' ప్రారంభం

**శానిటరీ కార్మికులకు పనిముట్ల పంపిణీ**

**క్లీన్ కల్లూరు గ్రీన్ కల్లూరు సాధింపే లక్ష్యంగా**

**ప్రజల భాగస్వామ్యంతోనే**

**పరిశుభ్ర పట్టణ నిర్మాణం సాధ్యం**

**మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్**

**మిషన్ శుభ్రతను ప్రజా ఉద్యమంగా మార్చుదాం**

**మున్సిపల్ కమిషనర్ జి సాయి కృష్ణారెడ్డి**











**కల్లూరు, జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** క్లీన్ కల్లూరు గ్రీన్ కల్లూరు సాధింపే లక్ష్యంగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్, మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణారెడ్డి తెలిపారు. కల్లూరు మున్సిపాలిటీలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ శుభ్రత కార్యక్రమాన్ని కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయం నందు సోమవారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై కౌన్సిలర్లతో కలిసి శానిటరీ కార్మికులకు పారిశుద్ధ్య పనులకు అవసరమైన చీపుర్లు, పారలు, గునపాలు, ఇతర పనిముట్లను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, శానిటరీ కార్మికులతో కలిసి క్యాచ్ ది రైన్ ప్రతిజ్ఞ నిర్వహించారు. వర్షపు నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతిజ్ఞ చేశారు.తదుపరి మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు నందు కార్యక్రమాన్ని ప్రారంభించారు. శానిటరీ కార్మికులందరూ ఒకే వార్డులో సమిష్టిగా పాల్గొని మాస్ గ్యాంగ్ వర్క్ ద్వారా రహదారులు, కాలువలు, కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. చెత్త తొలగింపు, కాలువల శుభ్రపరచడం, రోడ్ల స్వీపింగ్, మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించడం వంటి పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ మాట్లాడుతూస్వచ్ఛతే లక్ష్యం శుభ్రతే మార్గం అనే నినాదంతో కల్లూరు మున్సిపాలిటీ మిషన్ శుభ్రత కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ పరిశుభ్రతలో శానిటరీ కార్మికుల సేవలు ఎంతో గొప్పవని, వారి అంకితభావంతోనే పరిశుభ్రమైన పట్టణ నిర్మాణం సాధ్యమవుతుందని కొనియాడారు. శానిటరీ కార్మికులకు అవసరమైన పనిముట్లను అందించడం ద్వారా మరింత సమర్ధవంతంగా విధులు నిర్వహించే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి వార్డులో ఇదే తరహాలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి క్లీన్ కల్లూరు గ్రీన్ కల్లూరు లక్ష్యాన్ని సాధిస్తామని చెప్పారు. ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛత ప్రారంభమవ్వాలని, ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ జి సాయి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మిషన్ శుభ్రత కార్యక్రమం కల్లూరు మున్సిపాలిటీని పరిశుభ్రమైన, ఆరోగ్య వంతమైన పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమమని తెలిపారు. ప్రతి వార్డులో ముందుగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, షెడ్యూల్ ప్రకారం అన్ని వార్డుల్లో మిషన్ శుభ్రతను విజయవంతంగా అమలు చేస్తామని పేర్కొన్నారు.మిషన్ శుభ్రత ఒక్కరోజు కార్యక్రమం కాదని, ఇది ప్రతి ఉద్యోగి, ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి పౌరుడు బాధ్యతగా భావించి నిరంతరం కొనసాగించాల్సిన ప్రజా ఉద్యమమని అన్నారు. శానిటరీ కార్మికులు తమ విధులను అంకితభావంతో నిర్వహిస్తూ పట్టణ పరిశుభ్రతకు మరింత కృషి చేయాలని సూచించారు.ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే వేయాలని కోరారు. తడి పొడి చెత్తను వేరు చేయాలని, వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, పరిశుభ్రమైన కల్లూరు నిర్మాణంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. మిషన్ శుభ్రతలో భాగంగా ప్రతి శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు, కాలువల శుభ్రపరిచే పనులు, రోడ్ల స్వీపింగ్, చెత్త తొలగింపు, మొక్కల సంరక్షణ, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు లక్కినేని రఘు, జిల్లెల్ల స్వాతి, బీరెల్లి మాధవరావు, దాసరి సుధారాణి, భుక్య రాంబాయ్, బానోత్ మారోని, కళ్యాణపు నవ్య, పెద్దబోయిన లక్ష్మి నరసింహారావు, కిష్టంశెట్టి లక్ష్మి ఏడుకొండలు, మహమ్మద్ ఇస్మాయిల్, దార్ల చిన్నలక్ష్మి నరసింహారావు, యాసా నాగమణి శ్రీకాంత్, ఉబ్బన రాంబాబు, కనపర్తి శ్యామల, ప్రతాప్ ల్యాబ్ అధినేత మండల యూత్ అధ్యక్షులు పెదకంటి రామకృష్ణ, ఖమ్మంపాటి రాధ వీరస్వామి, గుండ్ల పుల్లారావు, మున్సిపల్ అధికారులు మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది, శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు

**- జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్**



**హైదరాబాద్, జులై 13(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన అస్త వ్యస్థంగా తయారైందని రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ ఆరోపించారు. సోమవారం కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం లోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు కనీస వసతులను కల్పించడంలో సీఎం పూర్తిగా విఫలమైనాడని, నరూర్ నగర్ లోని బాలికల హాస్టళ్ల దుస్థితే నిదర్శనమని ధ్వజమెత్తారు. హాస్టల్లో ఉంటున్న విద్యార్థులకు మంచినీరు, మరుగుదొడ్లు, భోజన వసతులను కల్పించడంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని, నిరుద్యోగులకు యేడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, దానికితోడు నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేయడమే కాకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల శాశ్వతంగా విద్యను దూరం చేయడం కోసమే ఫీజు రియంబర్స్మెంట్ పథకానికి తూట్లు పొడుస్తూ యాజమాన్యాలకు ప్రభుత్వం కొమ్ము కాస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పి. కృష్ణ, భూషన్ భాస్కర్, ముత్యాల్ రావు, ప్రశాంత్ నిమ్కర్, సత్యపాల్ సింగ్, ప్రదీప్ గౌడ్, పాల్గొన్నారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో అనుమతులకు విరుద్ధంగా 8,9,10 తరగతులు నిర్వహిస్తున్న చర్యలు తీసుకోరా..?

- రాజకీయ నాయకుల అండదండలతో అనుమతులకు విరుద్ధంగా తరగతులు
- అనుమతులకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాల పై చర్యలు చేపట్టాలి




**ఉప్పల్ జులై 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామంతపూర్ డివిజన్ అరవింద్ నగర్ కాలనీలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రభుత్వ అనుమతులు ఒకటవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు అనుమతులు ఉన్నప్పటికీ ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా 8,9,10 అదనపు తరగతులు నిర్వహిస్తున్నారని విద్యాశాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని స్థానికుల ఆరోపణ, విద్యాశాఖ నుంచి 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు ప్రభుత్వ గుర్తింపు అనుమతులు ఉన్నప్పటికీ, అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.అనుమతి లేని తరగతుల నిర్వహణ పై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చూస్తున్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న తరగతులను నిలిపివేయాలని స్థానికులు విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు.నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే సంబంధిత అధికారుల ద్వారా తగిన పరిపాలనా చర్యలు, అవసరమైతే గుర్తింపు రద్దు లేదా అనుమతి లేని తరగతుల నిలిపివేత వంటి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

# హక్కులకోసం కలెక్టరేట్ ను ముట్టడించిన కలం యోధులు

- జర్నలిస్టుల గర్జనతో గళమెత్తిన ఖమ్మం
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుతో వందలాది మంది జర్నలిస్టుల భారీ ఆందోళన హామీలు కాదు, అమలే కావాలంటూ ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరిక
- ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డుల సాధనకై జులై 15న హైదరాబాద్ సమాచార భవన్ ముట్టడికి పిలుపు
- 15 రోజుల్లో అర్హులందరికీ అక్రిడిటేషన్ల జారీకి కలెక్టర్ ఆదేశం!





**ఖమ్మం ప్రతినిధి, జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజ శ్రేయస్సే ధ్యేయంగా, ప్రజాసమస్యలపై నిత్యం కలం పట్టి పోరాడే జర్నలిస్టులు.. తమ న్యాయమైన హక్కుల సాధనకై ఏకతాటిపైకి వచ్చి గళమెత్తారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్ - 2843) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయం ముందర కలం యోధులు హక్కుల సాధనకై తమ ఆవేదనను నినాదాలతో, నిరసన రూపంలో వ్యక్తపరిచారు. వందమందికి పైగా జర్నలిస్టులు ఒక్కటై, సంఘటిత శక్తిని చాటుతూ గంటకు పైగా నిర్వహించిన ఈ భారీ నిరసన ప్రదర్శనతో కలెక్టరేట్ పరిసరాలు హోరెత్తాయి. ఈ సంఘటనకు సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర, పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్లను రాబోయే 15 రోజుల్లోగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాలని జిల్లా సమాచార శాఖ అధికారికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డిలు ఉద్వేగభరితంగా ప్రసంగిస్తూ, జర్నలిస్టుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యేంత వరకు ఈ పోరాట జ్వాల ఆరదని స్పష్టం చేశారు. సమాజంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ, ప్రభుత్వాల ఏర్పాటులోనూ, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ అహర్నిశలు శ్రమిస్తున్న క్షేత్రస్థాయి విలేకరుల జీవితాలు నేడు అంధకారంలో మగ్గుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రనక, పగలనక ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేస్తున్న జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో, కిరాయి ఇండ్లలో దుర్భర ఆర్థిక ఇబ్బందుల నడుమ కాలం వెళ్లదీస్తున్నారని తమ ఆవేదనను వెళ్లగక్కారు.ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా మా జర్నలిస్టుల బతుకులు మారడం లేదని, ఎన్నోమార్లు ఇచ్చిన ఇండ్ల స్థలాల హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు. వెంటనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు కూడా తక్షణమే పూర్తిస్థాయి కార్పొరేట్ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, రాష్ట్రవ్యాప్త ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో పాటు రైల్వే పాసుల రాయితీలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టులకు రకరకాల సర్టిఫికేట్ల పేరుతో కొర్రీలు పెడుతూ అక్రిడిటేషన్లు నిరాకరించడం దారుణమన్నారు. జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ, మున్సిపల్, డివిజన్ కేంద్రాలలో పనిచేస్తున్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టుల న్యాయమైన హక్కుల కోలాటంలో కలెక్టరేట్ ముందు జరిగిన ఈ మహా ప్రదర్శన విజయవంతం కావడంతో, జులై 15న హైదరాబాద్ సమాచార భవన్ ముట్టడికి ఖమ్మం జిల్లా నుండి జర్నలిస్టు లోకం కదం తొక్కాలని పిలుపునిచ్చారు. ఈ వినతిపై స్పందించిన కలెక్టర్ ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహాగర్జనలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు దువ్వాసాగర్, సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, టీబీజేఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మానుకొండ రవికిరణ్, సీనియర్ నాయకులు పారుపల్లి కృష్ణారావు, స్టేట్, జిల్లా కమిటీ సభ్యులు చీనేని బాలకృష్ణ, సంతోష్ చక్రవర్తి, నలుబోల మధుశ్రీ, షేక్ జానీపాషా, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరకొప్పుల రాంబాబు, గణేష్, గంగాధర్, నాగిరెడ్డి, అంజయ్య, బంకా వెంకటేశ్వర్లు, నాయకులు యాస లక్ష్మారెడ్డి, బండి కుమార్, పత్తి శ్రీనివాస్, అంజద్, శరత్, అర్షద్, గోపీ కృష్ణ, అశోక్ రెడ్డి, వీసారపు అంజయ్య, ఉపేందర్, కె.కిరణ్, గోపీ, షకీల్, సునీత, నాగలక్ష్మి, చంద్రశేఖర్, ధనాలకోట రవికుమార్, జావీద్, వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# జామియా ఇస్లామియాకు ఎప్సన్ ప్రొజెక్టర్ అందజేత

**- ఆధునిక సాంకేతికతతో విద్యాబోధనకు లక్ష్ ఫౌండేషన్ చేయూత**




**కరీంనగర్ జూలై13(పీసీడబ్ల్యూ న్యూస్):** విద్యా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బోధనను ప్రోత్సహించాలనే లక్ష్యంతో లక్ష్ ఫౌండేషన్ కరీంనగర్‌లోని జామియా ఇస్లామియాకు ఎప్సన్ ప్రొజెక్టర్‌తో పాటు సీలింగ్ మౌంట్ యూనిట్‌ను అందజేసింది. లక్ష్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ ముస్తాక్ అలీ ఖాన్ ప్రొజెక్టర్‌ను జామియా ఇస్లామియా డైరెక్టర్ ఆరిఫ్ ఇర్ఫాన్కు అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ముస్తాక్ అలీ ఖాన్ మాట్లాడుతూ, ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యార్థులకు ఆధునిక విద్యా వనరులు అందించడం ఎంతో అవసరమన్నారు. డిజిటల్ విద్యా సాధనాల ద్వారా క్లిష్టమైన పాఠ్యాంశాలను సులభంగా వివరించడంతో పాటు విద్యార్థుల్లో ఆసక్తి, భాగస్వామ్యం, అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. "విద్యార్థులకు సరైన అవకాశాలు, అవసరమైన సదుపాయాలు, ఆధునిక విద్యా వనరులు కల్పించినప్పుడే విద్య మరింత అర్థవంతంగా మారుతుంది" అని పేర్కొన్నారు. విద్య, వైద్యం, యువత సాధికారత, ఉపాధి, న్యాయ అవగాహన, సామాజిక సంక్షేమ రంగాల్లో లక్ష్ ఫౌండేషన్ సేవలు కొనసాగిస్తుందని వెల్లడించారు. ప్రొజెక్టర్‌ను డిజిటల్ తరగతులు, విద్యా ప్రెజెంటేషన్లు, సెమినార్లు, ఉపాధ్యాయ శిక్షణ, విద్యార్థుల అవగాహన కార్యక్రమాలతో పాటు వివిధ అకాడమిక్ కార్యకలాపాలకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జామియా ఇస్లామియా డైరెక్టర్ ఆరిఫ్ ఇర్ఫాన్ మాట్లాడుతూ, ప్రొజెక్టర్ విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సంస్థలో డిజిటల్, విజువల్ బోధనా పద్ధతులను మరింత విస్తృతంగా అమలు చేసేందుకు ఇది దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ముస్తాక్ అలీ ఖాన్‌తో పాటు లక్ష్ ఫౌండేషన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విద్య, సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాజిక అభివృద్ధికి శక్తివంతమైన సాధనాలుగా వినియోగించాలన్న లక్ష్ ఫౌండేషన్ సంకల్పానికి ఈ ప్రొజెక్టర్ అందజేత నిదర్శనంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు.




# కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి: మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ టౌన్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించి, వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని కోరుతూ వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లో తెలంగాణ చౌక్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పలు కార్మిక సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మానేరు నదిలో లభిస్తున్న ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించడం వల్ల స్థానికంగా ఇసుక కొరత ఏర్పడి భవన నిర్మాణ పనులు నిలిచిపోతున్నాయని, దాంతో వేలాది మంది నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని పేర్కొన్నారు. స్థానిక అవసరాల కోసం స్థానిక ఇసుక వినియోగానికి వెంటనే అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రస్తుతం ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న లేబర్ కార్యాలయాన్ని కలెక్టరేట్ ప్రాంగణానికి మార్చాలని, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు సరిగా జరగడం లేదని, వెంటనే కార్మిక సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ చొరవతో త్వరలో కరీంనగర్‌లో కార్మికుల కోసం ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు కానుందని మేయర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే కార్మికుల పక్షాన నిలబడి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మేయర్ హెచ్చరించారు. అనంతరం కార్మిక సంఘాల నాయకులతో కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు పునాది

**కరీంనగర్‌లో ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం**

**విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**





**కరీంనగర్ టౌన్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ నగరంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి మేయర్ కొలగాని శ్రీనివాస్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే దేశ భవిష్యత్తు బలంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారే పేగు సంబంధిత నులిపురుగుల నివారణే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, కౌమారదశలో ఉన్న వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల నులిపురుగుల సమస్యను నివారించడంతో పాటు రక్తహీనత తగ్గుతుందని, నీరసం, ఆకలి మందగించడం వంటి సమస్యలు దూరమవుతాయని చెప్పారు. దీనివల్ల పిల్లలు శారీరకంగా దృఢంగా, మానసికంగా చురుకుగా ఉండి చదువుపై పూర్తి ఏకాగ్రతతో మెరుగైన ప్రతిభ కనబరుస్తారని వివరించారు. "నేటి బాలలే రేపటి పౌరులు. వారు ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణించి, సమాజ అభివృద్ధికి తోడ్పడగలరు. ఆరోగ్యవంతమైన విద్యార్థులే బలమైన దేశ నిర్మాణానికి పునాది" అని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ఈ జాతీయ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వైద్య, విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. శ్రీరామ్, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), ఇతర జిల్లా స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అస్మిత ఖేలో ఇండియా లీగ్1 విజయవంతానికి కృషి చేసిన మండలోజు సుధాకర్‌కు ఘన సన్మానం

**- సెక్రెడ్ హార్ట్ హై స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ స్టెఫీ అభినందనలు**

**క్రీడారంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష**






**ఖమ్మం, ప్రతినిధి, జూలై 13 (పీసీడబ్ల్యూ న్యూస్):** అస్మిత ఖేలో ఇండియా లీగ్1 వెయిట్‌లిఫ్టింగ్ పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన మహబూబాబాద్ జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు, సెక్రెడ్ హార్ట్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు మండలోజు సుధాకర్‌ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణలో ఆయన చూపిన అంకితభావం, సమర్థతను ప్రశంసిస్తూ ప్రిన్సిపాల్ సిస్టర్ స్టెఫీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కోదాడలో నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా లీగ్1 వెయిట్‌లిఫ్టింగ్ పోటీల నిర్వహణలో మహబూబాబాద్ జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు మండలోజు సుధాకర్, ప్రధాన కార్యదర్శి కె. రాంబాబు రిఫరీలుగా బాధ్యతలు నిర్వహించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో సుధాకర్ అందించిన సేవలు నిర్వాహకులు, క్రీడా వర్గాల ప్రశంసలు పొందాయి. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, క్రీడల అభివృద్ధికి మండలోజు సుధాకర్ అందిస్తున్న సేవలు యువ క్రీడాకారులకు ఆదర్శప్రాయమని పేర్కొంది. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి ఖమ్మం జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని మండలోజు సుధాకర్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.


# ప్రభుత్వ హామీతో ముగిసిన సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీతో విరమణ సహకరించిన యూనియన్లు, మీడియాకు సిఎండిఓఎఐ కృతజ్ఞతలు**



**సత్తుపల్లి, జూలై 13 (పీసీడబ్ల్యూ న్యూస్) :** సింగరేణి కాలరీస్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సత్తుపల్లి శాఖ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా కొనసాగిన రిలే నిరాహార దీక్షలు సోమవారం విజయవంతంగా ముగిశాయి. అధికారుల న్యాయమైన డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కారానికి హామీ ఇవ్వడంతో దీక్షలను విరమిస్తున్నట్లు సంఘం నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపి, వారి డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని సిఎండిఓఎఐ ప్రతినిధులు తెలిపారు. సింగరేణి సంస్థ అభివృద్ధిలో అధికారుల పాత్ర ఎంతో కీలకమని ప్రభుత్వం గుర్తించడాన్ని వారు స్వాగతించారు. రిలే నిరాహార దీక్షల విజయానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, హెచ్ఎంఎస్, సీఐటీయూ యూనియన్లతో పాటు ఎస్సీ ఎస్టీ అసోసియేషన్, బీసీ ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్, డ్రైవర్స్ అసోసియేషన్, సేవా సభ్యులకు సిఎండిఓఎఐ సత్తుపల్లి శాఖ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. అలాగే తమ డిమాండ్లను ప్రజల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు సంఘం ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపింది. భవిష్యత్తులో కూడా సింగరేణి సంస్థ ప్రగతి, అధికారుల సంక్షేమం కోసం అందరి సహకారం ఇదే విధంగా కొనసాగాలని సిఎండిఓఎఐ సత్తుపల్లి శాఖ ఆకాంక్షించింది.

# మల్లంపల్లి మండల కేంద్రంలో నూతన ఎంపీడీవో భవనానికి భూమిపూజ





**మల్లంపల్లి మండల ప్రతినిధి జూలై 13 ( పి సి డబ్ల్యూ న్యూస్):** పంచాయతీరాజ్ & స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో మల్లంపల్లి మండల కేంద్రంలో నూతన ఎంపీడీవో కార్యాలయ భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు అధ్వర్యం వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి, ఆత్మ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ చారి, ముద్దునూరు తండా సర్పంచ్ రాజేందర్, మల్లంపల్లి ఉపసర్పంచ్ అంకం సురేష్, పంచాయతీరాజ్ డీఈ లింగారెడ్డి, ఈఈ అజయ్ కుమార్, ఏఈఈ లత, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద రాము, వార్డు సభ్యులు చిన్నబోయిన కవిత మహేందర్, మహమ్మద్ పాషా, జింక వేణు, కొంగరి నరేందర్, దయ్యాల కవిత చంద్రమౌళి, కక్కర్ల సాంబయ్య, ల్యాద లక్ష్మణ్, కొలిపాక శ్రీనివాస్, మహమ్మద్ మోసిన్, పర్వత శ్రీనివాస్‌తో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేస్తాం

**38.16 టీఎంసీల సామర్థ్యం పూర్తి వినియోగం**

**22 రిజర్వాయర్లు నింపి రైతులకు సాగునీరు**

**పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేశాం**

**సాగునీరు, తాగునీటి అవసరాలే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం**

**దేవాదుల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తాం**

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**








**కన్నాయిగూడెం, జూలై 13 ( పి సి డబ్ల్యూ న్యూస్):** దేవాదుల ఎత్తిపోతల పథకానికి నిధుల కొరత లేకుండా అన్ని పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రాజెక్టు పూర్తి సామర్థ్యాన్ని వినియోగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికప్రణాళికవిద్యుత్ శాఖల మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 38.16 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగిస్తూ ప్రాజెక్టు పరిధిలోని 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపి దేవాదుల ఆయకట్టుకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. భూసేకరణను వేగవంతంగా పూర్తి చేసి ప్రాజెక్టు పనుల్లో ఉన్న అన్ని అడ్డంకులను తొలగించడంతో పాటు పెండింగ్ బిల్లులను విడుదల చేసినట్లు వెల్లడించారు. సాగునీరు, తాగునీటి అవసరాలకే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, గోదావరి జలాలతో రైతాంగానికి శాశ్వత భరోసా కల్పించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. సోమవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్టు వద్దకు హెలికాప్టర్‌లో చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో లెనిన్ వస్తల్ టొప్పో, డీఎఫ్‌వో వికాస్ మీనాలు ఘన స్వాగతం పలికారు.**ప్రాజెక్టు పనులపై క్షేత్రస్థాయి పరిశీలన..** మంత్రులు తుపాకులగూడెం సమ్మక్కసారలమ్మ బ్యారేజీ వద్ద గోదావరి నీటి ప్రవాహం, నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించారు. తుపాకులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని జె. చొక్కారావు దేవాదుల ప్రాజెక్టు వాటర్ పాయింట్‌ను సందర్శించి మోటార్ల పనితీరు, ఎత్తిపోతల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులు, భూసేకరణ, పంపింగ్ వ్యవస్థ, మోటార్ల పనితీరు, సాగుతాగునీటి అవసరాలు, ఎత్తిపోతల సామర్థ్యం తదితర అంశాలపై ఇంజనీరింగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమీక్షలో ప్రాజెక్టు పురోగతిని వేగవంతం చేయడం, పరిపాలనా, సాంకేతిక అడ్డంకులను వెంటనే తొలగించడం, పనుల అమలుకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.**ఎల్‌నినో ప్రభావాన్ని ముందే అంచనా..** ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న ఎల్‌నినో పరిస్థితుల వల్ల రాష్ట్రంలో వర్షాభావం ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజా ప్రభుత్వం దూరదృష్టితో కార్యాచరణ చేపట్టిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గం పలుమార్లు సమీక్షలు నిర్వహించి వ్యవసాయం, తాగునీరు, జలవనరులపై ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. గోదావరి నదిలో ప్రవహిస్తున్న ప్రతి నీటి చుక్కను వినియోగించుకోవాలనే లక్ష్యంతో విద్యుత్ వ్యయం ఎంతైనా వెనుకాడకుండా నీటిని ఎత్తిపోసి చెరువులు నింపడం, భూగర్భ జలాలను పెంపొందించడం, గ్రామీణపట్టణ ప్రాంతాలకు తాగునీరు అందించడం, వ్యవసాయ భూములకు సాగునీరు అందించడం కోసం సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నట్లు చెప్పారు. దేవాదుల ఎత్తిపోతల పథకం లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే కీలక ప్రాజెక్టు అని దీని పూర్తి సామర్థ్యాన్ని వినియోగించి రైతులకు నమ్మకమైన నీటి వనరును అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.**రూ.194 కోట్ల బిల్లుల విడుదల.. 1** నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టులో ప్రస్తుతం 10 పంపుల్లో 7 పంపులు పనిచేస్తున్నాయని మరో ఒకటి రెండు రోజుల్లో అన్ని 10 పంపులు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజనీర్లను ఆదేశించినట్లు తెలిపారు. 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.194 కోట్ల బిల్లులను వెంటనే విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. భూసేకరణకు అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం సమకూర్చి పనులు ఎక్కడా నిలిచిపోకుండా చూస్తామని హామీ ఇచ్చారు. 38.16 టీఎంసీల సామర్థ్యానికి అనుగుణంగా నీటిని ఎత్తిపోసి కొత్త, స్థిరీకరణ ఆయకట్టులకు సాగునీరు అందించేలా పనులు వేగవంతం చేస్తామని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టును ఏడాదిలో పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, సుమారు 6.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు రాష్ట్ర రైతాంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రాజెక్టు ద్వారా ఆరు లక్షలకుపైగా ఎకరాలకు సాగునీరు అందుతుందని, నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, పంపుల నిర్వహణ సంస్థల మధ్య సమన్వయం ఉంటేనే పంపింగ్ వ్యవస్థ నిరంతరాయంగా కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

---

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్పంచ్



**తల్లాడ, జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తల్లాడ మండల కేంద్రంలో తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్ మేకల ప్రసాదరావు, సలోమి దంపతుల కనిష్ఠ కుమార్తె చిరంజీవి మేకల లలిత (హెప్సీబా), ఎర్రుపాలెం మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన నంద్రు ఆనందరావు, కమలమ్మ దంపతుల ప్రథమ కుమారుడు చిరంజీవి నంద్రు ప్రదీప్ కుమార్‌ల వివాహానంతర రిసెప్షన్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిసెప్షన్ వేడుకకు హాజరైన అన్నారు గూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, ఆనందంగా దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొరకొప్పు రామారావు, నారపోగు ప్రసాద్ బాబు, ఎం. యాకూబ్, జి. శ్రీనివాస్, ఇస్నపల్లి బాబురావు, గొడ్ల నరసింహారావు, ఇస్నపల్లి చిన్న కృష్ణ, జి. హర్ష తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు ఖమ్మంకు టీజీ టీ20 లీగ్ జట్టు

- **జట్టులో క్రికెటర్ డిప్యూటీ సీఎం తనయుడు షహేంద్ర మల్లు రాకా..**
- **పలు క్రికెట్ కోచ్, నిర్వాహకుల హర్షం**






**ఖమ్మం ప్రతినిధి, జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి విశేష ప్రాధాన్యతనిస్తూ తొలిసారిగా నిర్వహించిన టీజీ టీ20 లీగ్ తొలి ఎడిషన్‌లో అన్విత ఖమ్మం ఏసెస్ జట్టు రన్నరప్ గా నిలిచి ఖమ్మం జిల్లాకు విశేష గౌరవాన్ని తీసుకు వచ్చింది. ఈ సందర్భంగా, ఆ జట్టు సభ్యులకు ఖమ్మం జిల్లా ప్రజలు క్రీడాభిమానుల తరపున ఈనెల 14వ తేదీన ఘనస్వాగతం, అభినందన కార్యక్రమం జరుగనుంది. **ఖమ్మంలో నేటి షెడ్యూల్...** ఈ సందర్భంగా నేడు 14-07-2026 (మంగళవారం) నిర్వహించనున్న కార్యక్రమ వివరాలు. ఉదయం 10:00 గంటలకు అన్విత ఖమ్మం ఏసెస్ జట్టు ఖమ్మం చేరుకోనుంది. అనంతరం రామ్ లీలా ఫంక్షన్ హాల్ నుండి బైక్ ర్యాలీ ద్వారా జట్టుకు ఆత్మీయ స్వాగతం పలుకడం జరుగుతుంది.ఉదయం 11:00 గంటలకు ఖమ్మంలోని స్తంభాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించ బడతాయి.మధ్యాహ్నం 12:00 గంటలకు ఎస్‌బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం నిర్వహించ బడుతుంది.మధ్యాహ్నం 1:00 గంటలకు సీక్వెల్ రిసార్ట్స్ నందు క్రీడాకారులతో ముఖాముఖి కార్యక్రమం అనంతరం పాత్రికేయులతో మీడియా సమావేశం నిర్వహించబడుతుంది.ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా ప్రజలు, క్రీడా భిమానులు, యువత, విద్యార్థులు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై అన్విత ఖమ్మం ఏసెస్ జట్టు సాధించిన ఈ విశిష్ట విజయాన్ని అభినందించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనవి. తొలిసారిగా ఖమ్మం కు విచ్చేస్తున్న జట్టుకుఈమేరకు సీనియర్ క్రికెట్ క్రీడా కోచ్ లు, క్రీడా భిమానులు, సీనియర్ క్రికెట్ ఆర్గనైజర్ మహమ్మద్ మతిన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు..

## ఖమ్మంలో కంపుకొడుతున్న నిర్లక్ష్యం..

**రోగాల కోరల్లో 58వ డివిజన్ వాసులు!**


**నత్తనడకన డ్రైనేజీ పనులు..**

**నరకప్రాయంగా ప్రజల జీవనం..**

**అధికారులను మేల్కొల్పేందుకు కలెక్టర్‌కు వినతి**

**మురుగునీటిలోనే బతుకు పోరాటం..**
**కాళీ ప్లాట్లలో పందులు, దోమల**
**స్వైరవిహారం.. కదలని మున్సిపల్**
**యంత్రాంగంపై భగ్గుమంటున్న ప్రజలు**

**ఖమ్మం టౌన్ బిఆర్ఎస్ మాజీ ఈసీ మెంబర్ ఆరెంపల వీరభద్రం**



**ఖమ్మం ప్రతినిధి, జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్వచ్ఛమైన గాలి పీల్చుకుందామంటే మురుగు వాసన.. ప్రశాంతంగా నిద్రపోదామంటే దోమల మోత.. కాలు బయటపెడదామంటే పందులు, కుక్కల స్వైర విహారం! ఇదీ ఖమ్మం నగరంలోని 58వ డివిజన్ రాపర్తి నగర్ వాసుల గుండెకోత. వర్షాకాలం వస్తే చాలు ఆ ప్రాంత ప్రజల ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతకాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. అధికారుల పట్టింపులేని తనానికి, మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యానికి ఈ ప్రాంతం సజీవ సాక్ష్యంగా మారుతోంది. **రోగాలు పంచుతున్న కాళీ ప్లాట్లు.. పట్టించుకోని మున్సిపాలిటీ** రాపర్తి నగర్, రోడ్ నెంబర్ 12 పరిసరాల్లోని కాళీ ప్లాట్లు ఇప్పుడు విష జ్వరాలకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారాయి. ప్లాట్లలో సర్కారు తుమ్మలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. దీనికి తోడు ఎక్కడెక్కడి చెత్తాచెదారం అంతా అక్కడే పేరుకుపోవడంతో అవి పందులకు నివాసాలుగా మారాయి. కొన్నిచోట్ల పందులు చనిపోయి వస్తున్న దుర్వాసనతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తం కావడంతో మురుగునీరంతా రోడ్ల పైనే పారుతూ స్థానికులకు నరకం చూపిస్తోంది. **ఆరు నెలలుగా అసంపూర్తిగా బైపాస్ డ్రైనేజీ..** నగరం నడిబొడ్డున నిత్యం రద్దీగా ఉండే రాపర్తి నగర్-2 బైపాస్ మెయిన్ రోడ్డులో డ్రైనేజీ పనులు ఆరు నెలలుగా నత్తను మరిపిస్తున్నాయి. నాలుగు ప్రధాన డివిజన్లను కలిపే ఈ మార్గంలో పనులు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలమయమైన రోడ్లు, నిలిచిన నీటితో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని జనం గజగజ వణుకుతున్నారు. **ప్రజల పక్షాన కలెక్టర్‌కు బీఆర్ఎస్ నేతల వినతి..**ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారుల తీరుపై బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. స్థానికుల కష్టాలను చూసి చలించిన 58వ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఖమ్మం టౌన్ మాజీ ఈసీ మెంబర్ ఆరెంపల వీరభద్రం ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తక్షణమే డ్రైనేజీ పనులు పూర్తి చేసి, ప్లాట్లలోని చెట్లను, చెత్తను తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆరెంపల వీరభద్రం మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ హయాంలో ఏనాడూ డివిజన్ పరిస్థితి ఇంత అధ్వాన్నంగా లేదని గుర్తుచేశారు. రాపర్తి నగర్-2 సెంటర్లో ఆగిపోయిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను వెంటనే పునరుద్ధరించి ప్రమాదాలను నివారించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డివిజన్ సీనియర్ నాయకులు తాళ్లూరి సోమయ్య, మాజీ సెక్రెటరీ మాదిరాజు శ్రీనివాస్, నాయకులు సుంచు రాజేష్, వి.వి. చారి, మట్టే రఘు, మహిళా నాయకురాలు కూరపాటి విజయ, చింతమల్ల బాబురావు, మారపశీగు వీరస్వామి తదితరులు ఉన్నారు. ఇకనైనా అధికార యంత్రాంగం నిద్రలేచి, అంటువ్యాధులు ప్రబలకముందే సహాయక చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

## అభివృద్ధిపై అసత్య ప్రచారం మానుకోవాలి

**కాగితాలు కాదు... గ్రామాల్లోకి వెళ్లి అభివృద్ధిని చూడండి: మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**




**షాద్ నగర్,జూలై 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇటీవల మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు "మండలాలు ఏర్పాటు చేశారు కానీ అభివృద్ధి చేయలేదు" అని చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త జిల్లాలు, కొత్త మండలాలు, కొత్త గ్రామపంచాయ తీలను ఏర్పాటు చేసి పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసింది. దశలవారీగా కలెక్టరేట్ భవనాలు, జిల్లా వైద్య కళాశాలలు, గ్రామపంచాయతీ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసింది. కరోనా వంటి క్లిష్ట పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ఆగకుండా కొనసాగించింది. షాద్‌నగర్ నియోజకవర్గంలో నందిగామ, జిల్లేడు చౌదరిగూడెం మండలాలు ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధిని ప్రజలే ప్రత్యక్షంగా చూశారు. మండల కేంద్రాల్లో సీసీ రోడ్లు, గ్రామాలకు బీటీ రోడ్లు, కొత్తూర్‌షాద్‌నగర్ రహదారి అభివృద్ధి, అనేక గ్రామీణ మౌలిక సదుపాయాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి.ఎమ్మెల్యే శంకర్ గారు "కాగితాలు మాత్రమే తీసుకొచ్చారు, పనులు జరగలేదు" అని వ్యాఖ్యానించడం ఆశ్చర్యకరం. కాగితాల గురించి మాట్లాడే ముందు ఒక్కసారి గ్రామాల్లోకి వెళ్లి కళ్లారా అభివృద్ధి పనులు చూసి మాట్లాడండి. ఇప్పుడు మీరు రెండు బీటీ రోడ్లు తీసుకొచ్చి "మొత్తం అభివృద్ధి అంతా మేమే చేశాం" అని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమే. మీరు చేసిన పనులను ప్రజలు స్వాగతిస్తారు. కానీ గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన వేలాది కోట్ల రూపాయల అభివృద్ధిని పూర్తిగా విస్మరించి, అంతా ఇప్పుడు మాత్రమే జరుగుతోందని ప్రచారం చేయడం సబబు కాదు. 2014కు ముందు పరిస్థితులు ఎలా ఉండేవో, బీఆర్ఎస్ పాలనలో ఎన్ని బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, తాగునీటి పథకాలు, అభివృద్ధి పనులు జరిగాయో ప్రజలే చెబుతారు. అయితే గతంలో జరిగిన అభివృద్ధిని పూర్తిగా కాదని, "ఏమీ జరగలేదు" అనే విధంగా మాట్లాడటం ప్రజల విజ్ఞతను అవమానించడమేనని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు.

# అభిషేక్ శర్మ ఖాతాలో విచిత్రమైన రికార్డు..!



సౌతాంప్టన్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన ఆఖరి ఐదో టీ20 మ్యాచ్ టీమిండియాకు ఏమాత్రం కలిసిరాలేదు. ఈ మ్యాచ్‌లో భారత్ ఘోర పరాజయం పాలై సిరీస్‌ను చేజార్చుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ మ్యాచులో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ ఓ అరుదైన రికార్డు సాధించాడు. సౌతాంప్టన్ మ్యాచులో అభిషేక్ శర్మ ఒక విచిత్రమైన, ఎవరూ ఊహించని అంతర్జాతీయ క్రికెట్ మైలురాయిని అందుకొని రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు. అభిషేక్ శర్మ.. వన్డే లేదా టెస్ట్ ఫార్మాట్ ఆడకుండా.. అత్యధిక టీ20 మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా నిలిచాడు. శనివారం భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగిన ఐదో టీ20 మ్యాచులో అతడు ఈ ఫీట్ సాధించాడు. ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్.. టీమిండియా తరఫున ఇప్పటివరకు 53 టీ20 మ్యాచులు ఆడాడు. ఈ క్రమంలోనే వెస్టిండీస్ మాజీ స్పిన్నర్ శామ్యూల్ బద్రీని అధిగమించాడు. అతడు గతంలో టెస్ట్ లేదా వన్డే ఫార్మాట్ ఆడకుండా జాతీయ జట్టు తరఫున అత్యధికంగా 52 టీ20లు ఆడాడు. కాగా ఇటీవల భారత జట్టు టీ20 క్రికెట్‌లో పేలవ ప్రదర్శన చేస్తోంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో వరుసగా వైట్ వాష్‌కు గురైంది. దీంతో 1601 రోజుల తర్వాత ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ స్థానాన్ని కోల్పోయింది. వరుసగా రెండు టీ20 ప్రపంచకప్ టైటిల్స్ సాధించిన టీమిండియా.. ఇలాంటి ఫలితాలు అందుకోవడం పట్ల క్రీడా విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు సిరీస్‌లలోనూ అభిషేక్ శర్మ మోస్తరు ప్రదర్శన చేశాడు. ఇంగ్లాండ్‌లో ఐదో టీ20లో సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. ఈ మ్యాచులో టీమిండియా చిత్తుగా ఓడిపోయింది.

# చిరస్మరణీయ విజయం

**• లార్డ్స్ టెస్టులో టీమిండియా చారిత్రాత్మక గెలుపు • ఇంగ్లాండ్‌ను చిత్తుగా ఓడించిన భారత్ • రెండో ఇన్నింగ్స్‌లోనూ భారత బ్యాటర్ల జోరు**




టీమ్ఇండియా మహిళల క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో హర్మన్‌సేన 270 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. క్రికెట్‌కు పుట్టినిల్లుగా భావించే లార్డ్స్ మైదానంలో టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించడం భారత మహిళల క్రికెట్‌లో ఇది చరిత్రాత్మకం. రెండో ఇన్నింగ్స్‌లో 457 పరుగుల భారీ టార్గెట్ ఛేదనలో ఇంగ్లాండ్ 186 పరుగులకు కుప్పకూలింది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 4, సయాలి, క్రాంతి గౌడ్, దీప్తి శర్మ తలో 2 వికెట్లు పడగొట్టారు. ఇంగ్లాండ్ భారీ ఛేదనలో ఓవర్‌నైట్ స్కోర్ 130-6తో నాలుగో రోజు ఆట ప్రారంభమైంది. అయితే మునుపటి రోజు జోరును కొనసాగించిన టీమ్ఇండియా అమ్మాయిలు అదే జోష్‌లో టపటపా వికెట్లు పడగొట్టారు. దీంతో ఇంగ్లాండ్ ఓవర్‌నైట్ స్కోరుకు 56 పరుగులో జోడించి చివరి నాలుగు వికెట్లు కోల్పోయింది. క్రీజులో కుదురుకొని హాఫ్ సెంచరీ సాధించిన అమీ జోన్స్ (54)ను స్నేహ్ రాణా ఔట్ చేసి మళ్లీ వికెట్ల వేట మొదలు పెట్టింది. ఆ తర్వాత 33 బంతులు ఎదుర్కొని ఒకే ఒక్క పరుగు చేసిన ఇస్సీ వాంగ్‌ను దీప్తి శర్మ క్లీన్ బౌల్డ్ చేసింది. ఆ తర్వాత కాసేపటికే లారెన్ (0)ను కూడా దీప్తినే వెనక్కి పంపింది. అయితే చివర్లో ఎకిల్‌స్టోన్ (50) కాసేపు నిలదొక్కుకోవడంతో భారత్ విజయం కాస్త ఆలస్యం అయ్యింది. చివరికి ఆమెను స్నేహ్ రాణా ఔట్ చేసి భారత్‌కు చరిత్రాత్మక విజయాన్ని అందించింది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ లీడ్‌తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్, ఇంగ్లాండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును పరిగెత్తించింది. మూడో రోజు ఆటలో ఇంగ్లాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 29 ఓవర్లు ముగిసే సరికి 100/5తో నిలిచింది. ఇంగ్లాండ్ విజయానికి ఇంకా 357 పరుగులు అవసరం కాగా.. భారత్ మరో ఐదు వికెట్లు సాధిస్తే చరిత్రాత్మక విజయం సాధిస్తుంది. ఓవర్ నైట్ స్కోరు 154/1తో మూడో రోజు ఆట ప్రారంభించిన భారత్ కాసేపటికే వికెట్ కోల్పోయింది. జట్టు స్కోరు 161 వద్ద స్మృతి మంధాన 70 రన్స్ చేసి ఔట్ అయింది. అయితే యస్తికా భాటియా మాత్రం అదరగొట్టింది. లార్డ్స్‌లో శతక్కొట్టి.. టెస్ట్ క్రికెట్‌లో ఇక్కడ సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. 113 పరుగులు చేసిన అనంతరం ఆమె పెవిలియన్ చేరింది. ఆమె ఔట్ అయిన తర్వాత టీమిండియా వరుసగా వికెట్లు కోల్పోయింది. చివర్లో రిచా ఘోష్ 50 రన్స్ నాటౌట్‌తో భారత్ భారీ స్కోరు చేసింది. 341/7 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఇంగ్లాండ్ ముందు 457 పరుగుల భారీ లక్ష్యాన్ని నిలిపింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిపోయినప్పటికీ భారత్ తొలి రోజు నుంచే పూర్తిగా ఆధిపత్యం చలాయించింది. ఏ దశలోనూ ఇంగ్లాండ్ విజయం దిశగా సాగలేదు. తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ స్మృతి మంధాన (83 పరుగులు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (58 పరుగులు), దీప్తి శర్మ (57 పరుగులు) ముగ్గురూ హాఫ్ సెంచరీలతో రాణించడంతో భారత్ పోరాడగలిగే 285 పరుగులు చేయగలిగింది. ఆ తర్వాత తొలి బౌలింగ్‌లోనూ అదే సత్తా చాటుతూ ప్రత్యర్థిని 170 రన్స్‌కే ఆలౌట్ చేసింది. టీమ్ఇండియా ప్లేయర్లు క్రాంతి గౌడ్, యస్తికా భాటియా తమతమ కెరీర్‌లో అరుదైన ఘనత సాధించారు. రెండో రోజు ఆటలో తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లతో సత్తా చాటి ఇంగ్లాండ్ పతనాన్ని శాసించిన క్రాంతి గౌడ్ తన పేరును లార్డ్స్ ఆనర్స్ బోర్డులో లిఖించుకుంది. దీంతో ఈ గౌరవం అందుకున్న తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు సాధించింది. అంతకుముందు ఏ మహిళా ప్లేయర్‌కు కూడా ఈ గౌరవం దక్కలేదు. ఆ తర్వాత మూడో రోజు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ బ్యాటర్ యస్తికా భాటియా శతకం బాదేసింది. వన్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన భాటియా 158 బంతులు ఎదుర్కొని 113 పరుగులు చేసింది. ఇందులో 14 ఫోర్లు ఉన్నాయి. దీంతో లార్డ్స్ మైదానంలో టెస్ట్ సెంచరీ సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా యస్తికా భాటియా చరిత్ర సృష్టించింది. ఫలితంగా ఆమె పేరు కూడా అక్కడి ప్రఖ్యాత 'ఆనర్స్ బోర్డు'పై కెక్కింది. ఇది భారత క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయంగా చెప్పవచ్చు. అయితే భారత క్రికెట్ దిగ్గజాలు సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీలాంటి బ్యాటర్లకు సైతం లార్డ్స్‌లో సెంచరీ సాధించడం సాధ్యం కాలేదు. అలాంటిది 26ఏళ్ల యస్తిక ఈ ఘనత అందుకుంది. ఇక లార్డ్స్‌లో శతకం బాదిన భారత 11వ క్రికెటర్‌గానూ నిలిచింది. వినూ మన్కడ్, దిలీప్ వెంగ్‌సర్కార్, గుండప్ప విశ్వనాథ్, రవిశాస్త్రి, మహ్మద్ అజారుద్దీన్, సౌరభ్ గంగూలీ, అజిత్ అగార్కర్, రాహుల్ ద్రవిడ్, కేఎల్ రాహుల్ అజింక్యా రహానే లార్డ్స్‌లో టెస్టు సెంచరీలు చేశారు. సంక్షిప్త స్కోర్లు:భారత్:తొలి ఇన్నింగ్స్ - 285/10రెండో ఇన్నింగ్స్ - 347/7 (డిక్లేర్డ్)ఇంగ్లాండ్:తొలి ఇన్నింగ్స్ - 170/ 10రెండో ఇన్నింగ్స్ - 186 / 10

# హెడ్ కోచ్ పదవికి మెక్‌కల్లమ్ రాజీనామా..!



ఇంగ్లాండ్ ప్రధాన కోచ్ పదవికి బ్రెండన్ మెక్‌కల్లమ్ రాజీనామా చేశాడు. ఇటీవల జట్టు చెత్త ప్రదర్శనతో విమర్శల పాలైన మెక్‌కల్లమ్ ఆదివారం (జులై 12, 2026) తాను కోచ్‌గా వైదొలుగుతున్నట్టు అధికారికంగా ప్రకటించాడు. 2022 నుంచి బెన్ స్టోక్స్‌తో కలిసి 'బజ్ బాల్' క్రికెట్‌ను ప్రపంచానికి పరిచయం చేసిన అతడు.. తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నాడు. బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోజుల వ్యవధిలోనే మెక్ కల్లమ్ .. తప్పుకోవడం గమనార్హం. మెక్‌కల్లమ్ నిష్క్రమణ బాజ్ బాల్ శకానికి ముగింపు పలికినట్లయింది. మెక్‌కల్లమ్ 2022 నుంచి ఇంగ్లాండ్ టెస్ట్ కోచ్‌గా ఉన్నాడు. 2025లో వైట్-బాల్ జట్లకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. "టెస్ట్ జట్టుకు కోచింగ్ ఇవ్వడం అంటే నాకు చాలా ఇష్టం. మేం కలిసి సాధించిన వాటిపై గర్వపడుతున్నా. ఈ కాలంలో ఎన్నో నమ్మశక్యంకాని విజయాలు, అదే సమయంలో కఠిన ఫలితాలు చూశాం. కానీ ఇదంతా ఆటలో భాగమే. టెస్ట్ జట్టుకు హెడ్ కోచ్ పదవిని అదృష్టం, గౌరవంగా భావిస్తున్నా. నా ఈ ప్రయాణంలో మాకు మద్దతు ఇచ్చిన ఆటగాళ్లు, సిబ్బంది, అభిమానులకు కృతజ్ఞతలు. ఇప్పుడు నా దృష్టి వైట్ బాల్ జట్లకు కోచింగ్ ఇవ్వడంపై ఉంటుంది" అని మెక్ కల్లమ్ తన ప్రకటనలో పేర్కొన్నాడు. 2022లో ఇంగ్లాండ్ టెస్ట్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన మెక్‌కల్లమ్.. అప్పటి కెప్టెన్ బెన్ స్టోక్స్‌తో కలిసి దూకుడైన ఆటకు శ్రీకారం చుట్టాడు. దీనికే 'బజ్‌బాల్' అని పేరొచ్చింది. ప్రారంభంలో బజ్ బాల్ మెరుగైన ఫలితాలు ఇచ్చింది. న్యూజిలాండ్ (3-0), దక్షిణాఫ్రికా (2-1)తో సిరీస్‌లు గెలుచుకుంది. పాకిస్థాన్‌పై 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. కానీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్‌లో మాత్రం ఇప్పటివరకు ఫైనల్ చేరలేకపోయింది. ఇంగ్లాండ్ 2021-23 సైకిల్‌లో నాలుగో స్థానంలో, 2023-25 సైకిల్‌లో ఐదో ప్లేసులో నిలిచింది. ప్రస్తుతం 2025-27 స్టాండింగ్స్‌లో ఏడవ స్థానంలో ఉంది. ఇంగ్లాండ్ ఇటీవల టెస్టుల్లో పేలవ ఫలితాలు అందుకుంది. ఈ ఏడాది ప్రారంభంలో ఆస్ట్రేలియాలో ఇంగ్లాండ్ 4-1తో యాషెస్‌లో పరాజయం పాలైంది. గత నెలలో న్యూజిలాండ్ చేతిలో 2-1 తేడాతో స్వదేశంలో టెస్టు సిరీస్ ఓడిపోయింది.

# చెన్నై హెడ్ కోచ్ పదవికి ఫ్లెమింగ్ రాజీనామా..



## కొత్త కోచ్ రేసులో హేమంగ్ బదానీ, ద్రవిడ్

ఐపీఎల్ చరిత్రలోనే విజయవంతమైన కోచ్‌ల్లో ఒకరైన స్టీఫెన్ ఫ్లెమింగ్ చెన్నై సూపర్ కింగ్స్ తో తన అనుబంధాన్ని ముగించారు. ఏకంగా 18 ఏళ్లపాటు సీఎస్కేతో కలిసి పని చేసిన ఆయన చెన్నై హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకున్నారు. తాము, ఫ్లెమింగ్ ఉమ్మడిగా ఈ నిర్ణయానికి వచ్చినట్లు చెన్నై సూపర్ కింగ్స్ సోమవారం ప్రకటించింది. చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుతం సంధి దశలో ఉంది. సీఎస్కేకు క్రేజ్ తీసుకొచ్చిన ధోనీ కెరీర్ చరమాంకంలో ఉంది. దీంతో రుతురాజ్ గైక్వాడ్‌కు కెప్టెన్సీ పగ్గాలు అప్పగించారు. గత మూడు సీజన్లలో చెన్నై ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయింది. 2024, 2025, 2026 సీజన్లలో లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. చెన్నై సూపర్ కింగ్స్ సిస్టర్ ఫ్రాంచైజీ అయిన టెక్సాస్ సూపర్ కింగ్స్ సైతం ఈ ఏడాది మేజర్ లీగ్ క్రికెట్‌లో చివరి స్థానానికి పరిమితమైంది. ఈ జట్టు బాధ్యతలను కూడా ఫ్లెమింగ్ పర్యవేక్షించేవారు. ఫ్రాంచైజీకి చెందిన జట్లు వరుసగా విఫలం అవుతున్న నేపథ్యంలో ఫ్లెమింగ్‌తో అనుబంధాన్ని సూపర్ కింగ్స్ తెంచుకుందని భావిస్తున్నారు. ఐపీఎల్‌తోపాటు అమెరికా, సౌతాఫ్రికాల్లోని సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీల బాధ్యతల నుంచి కూడా ఫ్లెమింగ్ తప్పుకున్నారు. 2008లో ఐపీఎల్ తొలి సీజన్లో ఆటగాడిగా చెన్నై సూపర్ కింగ్స్‌తో అనుబంధాన్ని మొదలుపెట్టిన ఫ్లెమింగ్.. 2009 సీజన్లో హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టారు. 2026 సీజన్ ముగిసే వరకు ఆయన సీఎస్కే ప్రధాన కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 17 ఏళ్లకుపైగా చెన్నై హెడ్ కోచ్‌గా వ్యవహరించిన న్యూజిలాండ్ మాజీ కెప్టెన్.. బలమైన ఆధునిక క్రికెట్ సామ్రాజ్యాన్ని నిర్మించారు. ఫ్లెమింగ్ మార్గదర్శకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ ఐదు ఐపీఎల్ టైటిల్స్ సాధించడంతోపాటు రెండు ఛాంపియన్స్ లీగ్ టైటిళ్లు గెలుపొందింది. 12సార్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన సీఎస్కే పదిసార్లు ఫైనల్‌కు చేరుకుంది. కోచ్ ఫ్లెమింగ్, కెప్టెన్ ధోనీ మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయి. వీరిద్దరికీ మేనేజ్‌మెంట్ పూర్తి స్వేచ్ఛను ఇవ్వడంతో చెన్నై సూపర్ కింగ్స్ ఈ స్థాయిలో విజయాలు సాధించగలిగింది. ఫ్రాంచైజీ క్రికెట్లో ఆటగాళ్లు, సహాయక సిబ్బందిపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. కానీ ధోనీ, ఫ్లెమింగ్ కలిసి డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణం ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. వీరిద్దరూ ఒకరి నిర్ణయాలను మరొకరు గౌరవిస్తూ.. తమ పరిధులను అర్థం చేసుకుంటూ.. ప్రశాంతంగా పని చేసుకొని పోయేవారు. ఒకరిపై మరొకరికి అపారమైన నమ్మకం ఉండేది. సీఎస్కే తరఫున ఆడిన చాలా మంది ఆటగాళ్లు అక్కడి డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం గురించి ఇప్పటికీ గొప్పగా చెబుతుంటారు. "పద్దెనిమిదేళ్లు అనేది స్పోర్ట్స్‌లో లైఫ్ టైమ్, పూర్తి కృతజ్ఞతా భావంతో నేను వీడ్కోలు పలుకుతున్నా. సీఎస్కేతో నేను గడిపిన కాలం నా కోచింగ్ కెరీర్లోనే ఎంతో గొప్పది. మనం సాధించిన ప్రతి దానికీ నేను గర్విస్తున్నాను. మనం ఎన్నో మర్చిపోలేని విజయాలను ఆస్వాదించాం, ఎన్నో క్లిష్ట పరిస్థితులను అధిగమించాం. జీవితాంతం నాతో నిలిచిపోయే జ్ఞాపకాలను సంపాదించుకున్నాను" అని చెన్నై హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకుంటున్న సందర్భంగా స్టీఫెన్ ఫ్లెమింగ్ వ్యాఖ్యానించారు. ఫ్లెమింగ్ హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకుంటున్న వేళ సీఎస్కే ఫ్రాంచైజీ యజమాని రూపా గురునాథ్, మేనేజింగ్ డైరెక్టర్ కాశీ విశ్వనాథ్ ఆయనపై ప్రశంసలు గుప్పించారు. ఎలా ఆడాం అనేదే కాకుండా ఓ ఫ్రాంచైజీగా ఎలాంటి స్థానానికి చేరుకోవాలనుకున్నామో నిర్దేశించడంలో ఫ్లెమింగ్ ఎంతో తోడ్పాటును అందించారని కాశీ విశ్వనాథ్ తెలిపారు. నిలకడ, అణకువ, జట్టు ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వడం అనే విలువలపై ఆధారపడిన ఓ గొప్ప సంస్కృతిని ఫ్లెమింగ్ నిర్మించారంటూ సీఎస్కే ఎండీ కొనియాడారు.

## 24న సందడి చేయనున్న 'జన నాయగన్'

### ఓవర్‌సీస్‌లో అన్‌కట్ వర్షన్ విడుదల



ఏడు నెలల నిరీక్షణకు చెక్ పెడుతూ.. 'జన నాయగన్' జులై 24న సందడి చేయనుంది. విజయ్ కథానాయకుడిగా తెరకెక్కిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు పలు సూచనలు చేసిన విషయం తెలిసిందే. బోర్డు చెప్పిన మార్పులను చేసి చిత్రబృందం దీన్ని విడుదల చేసేందుకు సిద్ధమైంది. అయితే ఓవర్సీస్‌లో మాత్రం ఈ సినిమా అన్‌కట్ వెర్షన్ విడుదల కానుంది. భారత్‌లో పలు కట్స్ విధించినప్పటికీ, యూకే లో మాత్రం ఈ చిత్రం ఎలాంటి కట్స్ లేకుండా ప్రేక్షకుల ముందుకు రానుంది. అక్కడ ఈ సినిమాను ఎలాంటి మార్పుల్లేకుండానే విడుదల చేసేందుకు అనుమతి లభించింది. ఇక విజయ్ ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి కావడంతో సినిమా టైటిల్ కార్డులోనూ మార్పు చేశారు. గతంలో దళపతి విజయ్ అనే టైటిల్ కార్డు.. ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌గా మారనుంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు 12 మార్పులు సూచించి 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. విజయ్ నేతృత్వంలోని రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ప్రస్తావన ఉన్న డైలాగ్‌లను తొలగించడంతో పాటు కొన్ని పదాలను మ్యూట్ చేయాలని.. మరికొన్ని సన్నివేశాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. విడుదల నేపథ్యంలో త్వరలోనే దీని రిలీజ్ ట్రైలర్ రానున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# మళ్లీ బిజీగా మారిన నటి లయ

### వదలను సినిమా 17న విడుదల



అందాల నటి లయ 'భద్రం కొడుకో' చిత్రంతో బాలనటిగా తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత 'స్వయంవరం'తో హీరోయిన్ గా ఎదిగింది. ఫస్ట్ ఇన్నింగ్స్ లో పలు అర్థవంతమైన చిత్రాలలో నటించిన లయ... ఉత్తమ నటిగా నంది అవార్డులు అందుకుంది. అయితే ఆ తర్వాత వివాహానంతరం అమెరికాకు వెళ్ళిపోవడంతో కొన్నేళ్ళు నటనకు దూరంగా ఉంది. ఆ మధ్య రవితేజ 'అమర్ అక్బర్ ఆంథోని' మూవీలో తన కూతురుతో కలిసి మెరుపులా మెరిసన లయ... గత యేడాది 'తమ్ముడు' సినిమాతో రీ-ఎంట్రీ ఇచ్చింది. నితిన్ హీరోగా నటించిన ఆ సినిమా లయ అక్కగా నటించింది. కానీ ఆ సినిమా నిరాశ పర్చింది. ఆ తర్వాత తనకు బాగా కలిసి వచ్చిన శివాజీ సరసన లయ 'సంప్రదాయని సుప్పిని సుద్దపూసని' చిత్రంలో నాయికగా నటించింది. కానీ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ కూడా ఆశించిన విజయాన్ని అందుకోలేదు. గతంలో జగపతిబాబు సరసన 'మనోహరం'లో నటించి మంచి పేరు తెచ్చుకున్న లయ ఇప్పుడు మరోసారి ఆయనతోనే 'వదలా' చిత్రంలో చేస్తోంది. హృతికా శ్రీనివాస్ కీలక పాత్ర పోషించిన 'వదలా' హారర్ నేపథ్యంలో తెరకెక్కిన ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాను ఆకెళ్ళ వి కృష్ణ తెరకెక్కించాడు. మూడు వారాల క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమాకు మరింత మెరుగులద్ది జూలై 17న విడుదల చేస్తున్నట్టు జగపతి బాబు తెలిపారు. విశేషం ఏమంటే... గతంలో శ్రీకాంత్ సరసన పలు చిత్రాలలో నటించిన లయ ఇప్పుడు 'మిస్టర్ మిడిల్ క్లాస్'మూవీలో హీరోయిన్ గా నటించింది. ఇందులో రాజేంద్ర ప్రసాద్ వేంకటేశ్వర స్వామిగా నటిస్తున్నారు. ఈ సోషియో ఫాంటసీ మూవీని జి. నాగేశ్వరరెడ్డి డైరెక్ట్ చేశారు. ఈ సినిమా కూడా జూలై 17నే రాబోతోంది. ఇలా సెకండ్ ఇన్నింగ్స్‌లో లయ హీరోయిన్ గా నటించిన రెండు సినిమాలు ఒకే రోజు రావడం కాకతాళీయం.ఇదే విషయాన్ని 'వదలా' చిత్ర నిర్మాతల్లో ఒకరైన తమ్మారెడ్డి భరద్వాజ దగ్గర ప్రస్తావించినప్పుడు ఆయన చాలా స్పోర్టివ్‌గా ఈ అంశాన్ని తీసుకున్నారు. 'ప్రతి వారం ఐదారు సినిమాలు వస్తూనే ఉంటాయి. అందులో బాగున్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తూ ఉంటారు. లయ నటించిన రెండు సినిమాలు ఒకే రోజు రావడం తప్పేమీ కాదు. నిర్మాతలం ఎవరి వీలును బట్టి వాళ్ళం సినిమాలు రిలీజ్ చేస్తుంటాం. ఏ సినిమా బాగుంటే అది ఆడుతుంది... అంతే!' అని అన్నారు. ఈ వీకెండ్‌లో ఎనిమిది చిత్రాలు విడుదల అవుతుండగా, అందులో లయవి రెండు సినిమాలు. మరి వీటిల్లో ఏయే సినిమాలు ప్రేక్షకాదరణ పొందుతాయో చూడాలి.

## ధనుష్ సినిమాలో విజయ్ సేతుపతి?..



జాతీయ అవార్డు గ్రహీతలు, నటుడు ధనుష్, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రం 'తమిళ్ మురుగన్'. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను రేకెత్తించింది. అయితే, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి ఈ ఫస్ట్ లుక్‌ను తన సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో కోలీవుడ్‌లో సరికొత్త చర్చ మొదలైంది. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి కూడా ఒక కీలక పాత్ర పోషిస్తున్నారంటూ ఊహాగానాలు జోరందుకున్నాయి.వండర్‌వాల్ ఫిలింస్, ప్రొడక్షన్ మైల్స్ టు గో సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. విజయ్ సేతుపతి ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను షేర్ చేయడంతో, ఆయన ఈ ప్రాజెక్టులో భాగమయ్యారని అభిమానులు అంచనా వేస్తున్నారు. గతంలో వెట్రిమారన్ దర్శకత్వంలో వచ్చిన 'విడుదలై', 'అరసన్' వంటి చిత్రాల్లో విజయ్ సేతుపతి నటించారు. ఈ నేపథ్యంలో తాజా ప్రచారానికి మరింత బలం చేకూరింది.ధనుష్, వెట్రిమారన్ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాలు విమర్శకుల ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా ఘనవిజయం సాధించాయి. ఇప్పుడు ఈ శక్తివంతమైన కలయికకు విజయ్ సేతుపతి కూడా తోడైతే, సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటుతాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, విజయ్ సేతుపతి నటిస్తున్నట్లు చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. తదుపరి నటీనటుల వివరాలు, సినిమా విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత రావాల్సి ఉంది.



## ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశంపై పుకార్లు

### అలాంటిదేమీ లేదంటూ టీమ్ వెల్లడి



జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా జూలై 18న తారక్ కీలక ప్రకటన చేయనున్నారని, అభిమాన సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించ నున్నారనే వార్తలు వైరల్ అయ్యాయి. ఈ ప్రచారం సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారడంతో తాజాగా ఎన్టీఆర్ టీమ్ అధికారికంగా స్పందించి పూర్తి స్పష్టత ఇచ్చింది. ఇటీవల తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి విజయాన్ని అందుకున్న నేపథ్యంలో, అదే తరహాలో జూనియర్ ఎన్టీఆర్ కూడా రాజకీయాల్లోకి రాబోతున్నారనే ఊహాగానాలు మరింత బలపడ్డాయి. గతంలో 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించడం, అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశం కావడం వంటి పరిణామాలను ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ వార్తలన్నింటికీ ఎన్టీఆర్ టీమ్ ఆదివారం విడుదల చేసిన అధికారిక ప్రకటనతో చెక్ పడింది. టీమ్ విడుదల చేసిన ప్రకటనలో, జూలై 18న రాజకీయ ప్రకటన ఉంటుందంటూ ప్రచారంలో ఉన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. ఆ రోజు నిర్వహించబోయే కార్యక్రమం 'ఊరు వాడ' పేరుతో ఇప్పటికే ముందుగానే ప్రణాళికాబద్ధంగా రూపొందించిన ఒక సామాజిక కార్యక్రమమని వెల్లడించింది. ఈ కార్యక్రమం ద్వారా 'ఊరు వాడ' కార్యక్రమం లక్ష్యం, ఉద్దేశ్యం, విజన్‌ను ప్రజలకు పరిచయం చేయనున్నట్లు పేర్కొంది. దీనికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా తెలిపింది. 'ఊరు వాడ' కార్యక్రమానికి సంబంధించిన వేదిక, సమయం, పూర్తి కార్యాచరణ వివరాలను త్వరలోనే జూనియర్ ఎన్టీఆర్ అధికారిక సోషల్ మీడియా వేదికల ద్వారా వెల్లడిస్తామని టీమ్ పేర్కొంది. అలాగే మీడియా సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, సోషల్ మీడియా ఖాతాలు ధృవీకరించని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేసింది. ఎలాంటి వార్తనైనా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే ప్రచురించాలని కోరుతూ, తప్పుడు ప్రచారం వల్ల అభిమానుల్లో అనవసర గందరగోళం ఏర్పడుతుందని తెలిపింది.

## మహేశ్‌బాబు కుటుంబంలో పెళ్లి సందడి

### కొరియన్ అమ్మాయితో సిద్దార్థ్ గల్లా నిశ్చితార్థం



సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు సిద్దార్థ్ గల్లా త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్నారు. కొరియాకు చెందిన యువతి హాయిన్ (జిన్నీ)తో ప్రేమలో ఉన్న సిద్దార్థ్, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆదివారం ఘనంగా నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.ఈ శుభకార్యానికి మహేష్ బాబు కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులు హాజరై సందడి చేశారు. మహేష్ బాబు సతీమణి నమ్రత శిరోద్కర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఎంగేజ్‌మెంట్ వేడుకకు సంబంధించిన ప్రత్యేక ఫొటోలను షేర్ చేస్తూ కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఈ ఫొటోలు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఫొటోల్లో నమ్రతతో పాటు మహేష్ బాబు సోదరీమణులు, కుటుంబ సభ్యులు కనిపించారు. ముఖ్యంగా మహేష్ అన్న దివంగత రమేష్ బాబు కుమార్తె భారతి కూడా ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చాలా అరుదుగా పబ్లిక్‌లో కనిపించే భారతి ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో అభిమానులు ఆమె ఫొటోలను సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేస్తున్నారు. సిద్దార్థ్ గల్లా ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజకీయ నాయకుడు గల్లా జయదేవ్ మరియు పద్మావతి దంపతుల చిన్న కుమారుడు. ఆయన అన్న అశోక్ గల్లా ఇప్పటికే హీరోగా టాలీవుడ్‌లో అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతం అశోక్ గల్లా నటిస్తున్న 'వీసా' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఇక సిద్దార్థ్ గల్లా మాత్రం సినీ రంగానికి దూరంగా ఉండి కుటుంబ వ్యాపార వ్యవహారాలను నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా కొరియన్ యువతి హాయిన్‌తో ప్రేమలో ఉన్న ఆయన, ఇప్పుడు కుటుంబ సభ్యుల అంగీకారంతో కొత్త జీవితానికి శ్రీకారం చుట్టబోతున్నారు.

# వరుణ్ 'కొరియన్ కనకరాజు' టీజర్..

## రాయలసీమ టు కొరియా హారర్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ కొరియన్ కనకరాజు టీజర్ విడుదలైన తర్వాత సినిమాపై హైప్ మరింత పెరిగింది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న ఆ హారర్ కామెడీ మూవీలో ఎంటర్టైన్మెంట్, థ్రిల్, యాక్షన్ ను కొత్త తరహాలో చూపించే ప్రయత్నం చేసినట్లు టీజర్ ఫుల్ క్లారిటీ ఇచ్చింది. ముఖ్యంగా రాయలసీమ నుంచి కొరియా వరకు సాగే స్టోరీ లైన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. టీజర్ ప్రారంభం నుంచే కొత్తదనాన్ని చూపించే ప్రయత్నం కనిపిస్తుంది. ఒకవైపు సాధారణ రాయలసీమ యువకుడిలా కనిపించే కనకరాజు.. మరోవైపు స్టైలిష్ కొరియన్ మాఫియా బాస్ గా వరుణ్ తేజ్ కనిపించడం కథపై క్యూరియాసిటీని పెంచుతోంది. ఆ రెండు భిన్నమైన షేడ్స్ ను ఎలా కలిపారన్న అంశాన్ని మాత్రం మేకర్స్ పూర్తిగా బయటపెట్టకుండా సస్పెన్స్ కంటిన్యూ చేశారు.వరుణ్ తేజ్ లుక్ టీజర్ లో మెయిన్ అట్రాక్షన్ గా నిలిచింది. రాయలసీమ యువకుడి పాత్రలో చాలా న్యాచురల్ గా కనిపించడంతో పాటు, కొరియన్ అవతార్ లో స్టైలిష్ గా, ఇంటెన్స్ గా కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. రెండు విభిన్న పాత్రల్లో కూడా ఆయన చూపించిన బాడీ లాంగ్వేజ్, స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాపై అంచనాలను పెంచేలా ఉన్నాయి. టీజర్ లో మరో స్పెషాలిటీ కామెడీ. ముఖ్యంగా వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే సన్నివేశాలు ఫుల్ గా ఎంటర్టైన్మెంట్ ను పంచేలా కనిపిస్తున్నాయి. హారర్ కామెడీకి అవసరమైన ఫన్నీ ఎలిమెంట్స్ ను దర్శకుడు ఈక్వల్ గా మిక్స్ చేసినట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. భయం, నవ్వు రెండింటినీ ఒకేసారి అందించే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది. టెక్నికల్ గా కూడా టీజర్ మంచి రెస్పాన్స్ సంపాదిస్తోంది. కొరియా లొకేషన్లను చూపించిన తీరు, ప్రతి ఫ్రేమ్ ను గ్రాండ్ గా చూపించిన సినిమాటోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

విజువల్స్ కు తగ్గట్టుగా సంగీత దర్శకుడు ఎస్. తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ టీజర్ కు మరింత బలం చేకూర్చింది. కొన్ని సన్నివేశాల్లో బీజీఎం థ్రిల్ ను పెంచగా, మరికొన్ని చోట్ల ఎంటర్టైన్మెంట్ కు తగ్గట్టుగా సాగింది. హీరోయిన్ గా రితికా నాయక్ నటిస్తున్న ఆ చిత్రాన్ని ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్, యూవీ క్రియేషన్స్, టీ-సిరీస్ సౌత్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రొడక్షన్ వాల్యూస్ టీజర్ లో క్లియర్ గా కనిపిస్తున్నాయి. విజువల్ క్వాలిటీ, మేకింగ్ స్టాండర్డ్ సినిమాపై మరింత నమ్మకాన్ని కలిగిస్తున్నాయి. ఇప్పుడు కొరియన్ కనకరాజు మూవీ టీజర్ కేవలం కథను పరిచయం చేయడానికే పరిమితం కాకుండా, సినిమాలో ఉండబోయే ఎంటర్టైన్మెంట్ కు చిన్న ఉదాహరణగా చూపించినట్లు అనిపిస్తోంది. ఇండో- కొరియన్ బ్యాక్ డ్రాప్, వరుణ్ తేజ్ డ్యూయల్ షేడ్స్, హారర్ కామెడీ టచ్, స్టైలిష్ విజువల్స్ కలిసి ఆ చిత్రాన్ని ఆసక్తికరంగా మార్చాయి. టీజర్ కు వస్తున్న పాజిటివ్ రెస్పాన్స్ తో ఆగస్టు 7న విడుదల కానున్న ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రిజల్ట్ ను అందుకుంటుందన్న ఆసక్తి ఇప్పుడు సినీ ప్రియుల్లో నెలకొంది.